## రెండురోజులపాటు పోలీసు అధికారులు, సిబ్బంది గ్రామాల పర్యటన

-సిపి ఎస్.ఎం.విజయ్‌కుమార్

**సిద్దిపేట రూరల్, అక్టోబరు 25, ప్రభాతవార్త:**
పోలీసు అమరవీరుల సంస్మరణవారోత్సవాల్లో భాగంగా ఈనెల 27,28వ తేదీలలో రెండురోజులపాటు పోలీసు కమిషనరేట్ పరిధిలోని అన్ని గ్రామాలలో పోలీసు అధికారులు, సిబ్బంది గ్రామాలను సందర్శిస్తారని సిపి ఎస్.ఎం.విజయ్‌కుమార్ శనివారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు అధికారుల గ్రామాలపర్యటనలో గ్రామస్థులు గ్రామంలో ఉన్న సమస్యలను తెలియజేయాలని, సమస్యలు అక్కడే పరిష్కరించే అవకాశం ఉంటే వెంటనే పరిష్కరిస్తారని, ఇతరశాఖలకు చెందిన సమస్యలు ఉంటే ఆయాశాఖలకు నివేదిక అందించడం జరుగుతుందన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సిపి సూచించారు.



# మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

# వార్త

## ప్రజలకు అసౌకర్యం కలగకుండా అధికారులు సహకరించాలి

-కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్

**పటాన్‌చెరు, అక్టోబరు 25, ప్రభాతవార్త:**
పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ జిహెచ్‌ఎంసి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ ఎంజిరోడ్డు మున్నూరుకాపు ఫంక్షన్ హాల్ నుండి నేషనల్ హైవే వరకు రూ.1కోటి40లక్షల అంచనా వ్యయంతో నిర్మాణంలో ఉన్న రోడ్డుపనులను త్వరగాపూర్తిచేయాలని అధికారులను కోరారు. ప్రస్తుతం రోడ్డుపనులు కొనసాగుతున్న నేపథ్యంలో నూతన మార్కెట్‌రోడ్, ఇంద్రేశంరోడ్లలో భారీట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని గమనించి, ప్రజలకు ఇబ్బందులుకలగకుండా సిసి రోడ్డుపనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. పటాన్‌చెరులోని వివిధప్రాంతాల్లో ఏర్పాటుచేసిన ఛత్‌పూజ ఘాట్లవద్ద సౌకర్యాలు కల్పించాలని, జిహెచ్‌ఎంసి సిబ్బందిని పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచాలని అధికారులను కోరారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ సురేష్, ఇంజనీరింగ్ విభాగం డిఈ కృష్ణవేణి, ఈఈ సురేష్‌కుమార్, ఏఈ శివకుమార్, మహేష్ శ్రీనివాస్, హెచ్‌ఎండబ్ల్యుఎస్, ఎస్‌బిఏఈ అరుణ్ పాల్గొన్నారు.

## హరేకృష్ణ మూమెంట్ కల్చరల్ సెంటర్‌ను ప్రారంభించిన మంత్రి



హరేకృష్ణ మూమెంట్ కల్చరల్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

**కంది, అక్టోబరు 25, ప్రభాతవార్త:**
మండలంలో హరేకృష్ణ మూమెంట్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న హరేకృష్ణ కల్చరల్ సెంటర్ నిర్మాణంలో భాగంగా నిర్వహించిన మహానరసింహహోమం, గర్భాలయ యంత్రస్థాపన పూజా కార్యక్రమాల్లో మంత్రి దామోదర్ రాజనర్సింహ పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ సనాతనధర్మ మహోన్నత సంస్కృతికి, విలువలను ప్రాచుర్యంలోకి తెచ్చేందుకు హరేకృష్ణ మూమెంట్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. అక్షయపాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో 3 కొత్త ఫుడ్ డిస్ట్రిబ్యూషన్ వాహనాలను మంత్రి టిజి ఐఐసి చైర్మన్ తూర్పు నిర్మలజగ్గారెడ్డితో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. అక్షయపాత్ర ఫౌండేషన్ నిర్వహిస్తున్న కిచెన్, ఆధునిక వంటగదులను, స్నాక్స్, ఆటోమేటిక్ కూరగాయల వాషింగ్, కటింగ్ మిషన్‌లను మంత్రి పరిశీలించారు.

## ఎంపిని కలిసిన బిజెపి నాయకులు



ఎంపి రఘునందన్‌రావుతో బిజెపి మండల అధ్యక్షులు స్వామి

**రాయపోల్, అక్టోబరు 25, ప్రభాతవార్త:**
రాయపోల్ మండలపరిధిలోని బేగంపేట, ఏల్కల్, బంగ్లవెంకటపూర్ వరకు రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని ప్రధానమంత్రి సడక్‌యోజన పథకం ద్వారా రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని రాయపోల్ మండల బిజెపి నాయకులు మెదక్ ఎంపి రఘునందన్‌రావును శనివారం కలిసి విజ్ఞప్తి చేశారు. వెంటనే స్పందించిన ఎంపి గతంలో ప్రధానమంత్రి సడక్ యోజనపథకం ద్వారా మంజూరైన రూ.34లక్షల నిధులు రద్దుకావడంతో తిరిగి ఎస్టిమేషన్‌వేసి పంచించాలని పిఆర్ఏఈ రామును ఆదేశించారు. అలాగే నాచారంనుండి హైమాద్‌నగర్‌వరకు రోడ్డు మరమతు విషయమై సంబంధిత అధికారులతోమాట్లాడి సమస్య పరిష్కారంచేసేలా చర్యలుతీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు మంకిడి స్వామి, బిజెపి మండల మాజీ అధ్యక్షులు వెంకట్‌గౌడ్, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కమిషనర్ ఆధ్వర్యంలో హోటళ్లలో తనిఖీలు

-నిబంధనలు పాటించనివారిపై రూ.40వేల జరిమానా



హోటల్‌లో తనిఖీచేస్తున్న కమిషనర్ శ్రీనివాసరెడ్డి

**సంగారెడ్డి మున్సిపాలిటీ, అక్టోబరు 25, ప్రభాతవార్త:**
ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా కుళ్ళిపోయిన మాంసం, ఆహారపదార్థాలను వినియోగిస్తూ నిర్వహిస్తున్న హోటళ్లను తనిఖీచేసి నిబంధన అతిక్రమించిన హోటల్ యజమానులకు రూ. 40,000ల జరిమానా విధించినట్లు సంగారెడ్డి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సంగారెడ్డి పట్టణప్రజల ఫిర్యాదుమేరకు మున్సిపల్ సంబంధిత అధికారులు శనివారం సంగారెడ్డి పట్టణ పరిధిలోని రెస్టారెంట్, హోటల్‌లో తనిఖీలు నిర్వహించామని, తనిఖీలో షైన్ బావర్చి, పోతిరెడ్డిపల్లి కింగ్స్, ఎంఆర్‌సిబి కర్రీపాయింట్, కింగ్స్ దాబా 2, అరేబియన్ మండి హోటల్‌లో నాణ్యత పాటించకుండా చెడిపోయిన, కుళ్ళిపోయిన చికెన్‌ను గుర్తించి వారికి రూ.40వేల జరిమానా విధించడం జరిగినదని కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. హోటల్ పరిశుభ్ర వాతావరణంలో భోజనం తయారుచేయాలని, ఎవరైనా కుళ్ళినపదార్థాలు పడేయకుండా నిల్వ ఉంచి మరల వాడినట్లయితే వారికి భారీ జరిమానా విధించడంతోపాటు షాప్స్ మూసివేయడం జరుగుతుంది అని కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్ సయ్యద్ సాజిద్, వార్డ్ ఆఫీసర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

## గిరిజన గురుకుల పాఠశాలను సందర్శించిన న్యాయమూర్తి



గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి ఎం.హేమలత

**నర్సాపూర్, అక్టోబరు 25, ప్రభాతవార్త:**
నర్సాపూర్ మండలపరిధిలోని నారాయణపూర్ శివారులోగల ప్రభుత్వ బాలికల గిరిజన గురుకుల పాఠశాలను శనివారం జూనియర్ సివిల్ జడ్జ్, మండల్ లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ నర్సాపూర్ న్యాయమూర్తి ఎం.హేమలత సందర్శించారు. ఈ గురుకుల పాఠశాలలో ఇటీవల విద్యార్థినులను ఎలుకలు కరిచిన విషయాన్ని తెలుసుకుని స్పందించిన న్యాయమూర్తి బాలికల గిరిజన గురుకుల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి వసతిగృహంలో ఎలుకలుకరిచిన విద్యార్థులను పరామర్శించి వారి ఆరోగ్యపరిస్థితులు తెలుసుకొని వారికి మనోధైర్యం కల్పించారు. అనంతరం గురుకులంలో విద్యార్థులకోసం వండినభోజనాన్ని ఆమె ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈగురుకులంలో ఏమైనా సమస్యలున్నయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఏమైనాసమస్యలు తలెత్తినప్పుడు తక్షణమేస్పందించి వాటిని పరిష్కరించేందుకు కృషిచేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. చట్టపరమైన సమస్యలు తలెత్తినప్పుడు తగినన్యాయం కోసం మండల్ లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్‌ను ఆశ్రయించాలని జూనియర్ న్యాయమూర్తి ఎం.హేమలత సూచించారు. కార్యక్రమంలో లీగల్ సర్వీస్ న్యాయవాది స్వరూపరాణి, ప్రిన్సిపల్ లలితాదేవి, అధ్యాపకులు లీగల్ సర్వీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ విద్యాసంస్థల ఏర్పాటు

-రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకులాలు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ వసతిగృహాలలో విద్య, వసతి, శానిటేషన్, ఆరోగ్యం విషయాల్లో ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో శనివారం జిల్లా కలెక్టర్ హైమావతి, అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, ఆర్డీఓ సదానందంతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. సిఎం రేవంత్‌రెడ్డి పేద విద్యార్థులకు మంచి క్రమశిక్షణతో విద్యాబుద్ధులు నేర్పించి ఉన్నతమైన విలువలను విద్యార్థులకు అందించాలనేదే సిఎం ఆశయమన్నారు. అద్దెభవనాలలో కొనసాగుతున్న గురుకులాల సమస్యలపై పూర్తి నివేదిక అందించాలని ఆదేశించారు. అన్ని గురుకులాలు, సంక్షేమ వసతి గృహాలలో కామన్ డైట్ మెనూ పాటించాలన్నారు. తల్లిదండ్రులు ఎంతో నమ్మకంతో ప్రభుత్వ వసతి గృహాలలో పిల్లలను చేర్పిస్తారని వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా విద్య, వసతితోపాటు మంచి ఉన్నతమైన విలువలతో విద్యార్థులకు గురుకులాల్లో విద్యను అందించాలన్నారు. జిల్లా కలెక్టర్‌తో పాటు ఆయా సంక్షేమశాఖల అధికారులు గురుకులాలు, సంక్షేమ వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేయాలన్నారు.

**విద్యార్థుల బంగారుభవిష్యతే సర్కార్ ధ్యేయం...**
విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం రూ.200 కోట్లతో 25ఎకరాలలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ విద్యాసంస్థలను నెలకొల్పడం జరుగుతుందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తెలిపారు. సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని మిట్టపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల విద్యాలయాన్ని ఆయన సందర్శించారు. విద్యార్థులతో ముచ్చటించి, కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులకు అదనంగా కావలసిన సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. గురుకులంలో బట్టలు ఆరవేయడానికి ప్లాట్‌ఫామ్‌ల నిర్మాణానికి రూ.10 లక్షలు, ఇతర మరమ్మతుల కోసం రూ.15లక్షలు మంజూరుచేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా సాంఘికసంక్షేమ గురుకుల విద్యాలయాలను పర్యవేక్షించడానికి ప్రత్యేక అధికారులను నియమించమని అన్నారు. మంత్రి, జిల్లా కలెక్టర్, అధికారులు విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ సదానందం, కాంగ్రెస్ పార్టీ నాయకులు గూడూరి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనంచేస్తున్న మంత్రి లక్ష్మణ్ చిత్రంలో కలెక్టర్ హైమావతి

## మంత్రి సవాల్‌కు ప్రతిసవాల్ విసిరిన బిఆర్ఎస్

-ఈనెల 27న హైదారాబాద్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద చర్చకు సిద్ధమే



విలేకరులతో మాట్లాడుతున్న మాజీమంత్రి ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

**సిద్దిపేట అర్బన్, అక్టోబరు 25, ప్రభాతవార్త:**
సిద్దిపేట జిల్లా కేంద్రంలో సాంఘిక సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావుపై చేసిన అనుచిత వ్యాఖ్యాలపై మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌లు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జిల్లా కేంద్రంలోని మోహినిపుర శ్రీవేంకటేశ్వర దేవాలయంలో వారు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. బిఆర్ఎస్ 10యేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై, కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చిన 22నెలల్లో సిఎం రేవంత్‌రెడ్డి నాయత్వంలో సాగుతున్న ప్రజాపాలనలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి చర్చకు రావాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ విసిరిన సవాల్‌కు వారు ప్రతిసవాల్ విసిరారు. 27న హైదారాబాద్‌లోని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద తాము చర్చకు సిద్ధం అంటూ మీరు రావాలని సవాల్ విసిరారు. మంత్రి లక్ష్మణ్ సిద్దిపేటకు వచ్చి నిజాలు మాట్లాడాల్సింది పోయి అన్ని అబద్ధాలు మాట్లాడడం సిగ్గుచేటన్నారు. ఆ అబద్ధాలు తేటతెల్లం చేయడానికే ఇక్కడకి వచ్చామన్నారు. గుమ్మడికాయ దొంగలు ఎవరంటే భుజాలు తడుముకున్నట్లు ఉంది కాంగ్రెస్ మంత్రుల పరిస్థితి ఉందన్నారు. దండుపాళ్యం ముఠా అంటే ఎందుకు ఎగిరెగిరి పడుతున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ మంత్రులది ముమ్మాటికి దండుపాళ్యం ముఠానే అని అందినకాడికి దోచుకునుడు అందరు కలిసి పంచుకునుడే మీపని అని ఆరోపించారు. కేబినెట్ సమావేశం పెట్టి పర్సనల్ పంచాయతీలను చేస్తుంది నిజం కాదా అని ప్రశ్నించారు. ప్రజా సమస్యలపై చర్చించాల్సింది పోయి వాటాల కోసం చర్చించడం ఏమిటని ప్రశ్నించారు. ఈనెల 27న ఉదయం 11గంటలకు హైదారాబాద్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద చర్చకు రావడానికి తాము సిద్ధంగా ఉన్నామని దమ్ముంటే మీరూ రావాలని సవాల్ విసిరారు. సమావేశంలో బిఆర్ఎస్‌పార్టీ పట్టణ అధ్యక్షులు కొండం సంపత్‌రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు సాయిరాం, సారయ్య, నాగరాజురెడ్డి, తాడూరి సాయి ఈశ్వర్‌గౌడ్, గూడాల శ్రీకాంత్‌గౌడ్, ముత్యాల కనకయ్య పాల్గొన్నారు.

## నూతన పాఠశాల భవనాన్ని సత్వరం పూర్తిచేయాలి

-జూనియర్ సివిల్ జడ్జ్ న్యాయమూర్తి ఎం.హేమలత

-శిథిలావస్థలో ఉన్న పాఠశాల కూల్చివేతను తనిఖీచేసిన న్యాయమూర్తి

**నర్సాపూర్, అక్టోబరు 25, ప్రభాతవార్త:**
నర్సాపూర్ మున్సిపల్ పరిధిలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల యూనిట్ 1భవనం శిథిలావస్థలో ఉన్నందున ఈ పాఠశాలకు నూతన భవన నిర్మాణం మంజూరైనందున త్వరితగతిన నూతన పాఠశాల భవనాన్ని నిర్మించాలని జూనియర్ సివిల్ జడ్జి మండల్ సర్వీస్ కమిటీ చైర్మన్ నర్సాపూర్ న్యాయమూర్తి అధికారులకు సూచించారు. నర్సాపూర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల యూనిట్ 1 భవనం శిథిలావస్థకు చేరుకోగా విద్యార్థులు ఇరుకు గదిలో విద్యనభ్యసిస్తున్నందున శిథిలావస్థకు చేరిన పాఠశాలను వెంటనే కూల్చివేసి నూతన భవనం నిర్మించాలని న్యాయమూర్తి ఆదేశాలిచ్చారు. ఈ నేపథ్యంలో అధికారులు ఈ పాత పాఠశాల కూల్చివేత పనులు చేపట్టారు. శనివారం ఈ ప్రాథమిక పాఠశాల భవన కూల్చివేత పనులను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి ఎం.హేమలత మాట్లాడుతూ శిథిలావస్థకు చేరిన పాఠశాలలో ఇరుకైనగదుల్లో చిన్నపిల్లలయిన విద్యార్థులు ఇబ్బందులు పడుతూ విద్యాబోధన సాగిస్తున్న విషయాన్ని మండల్ లీగల్ సర్వీస్ కమిటీ దృష్టికి వచ్చిందన్నారు. ఈమేరకు శిథిలావస్థకు చేరిన ఈపాఠశాల భవనాన్ని మండల్ లీగల్ సర్వీస్ కమిటీ ద్వారా ఆకస్మిక తనిఖీలు జరిపి సంబంధిత అధికారులచేత తొలగించుటకు ఆదేశం చానని తెలిపారు. ఈస్థానంలో ఈప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరైనందున త్వరితగతిన ఈ నిర్మాణ పనులు పూర్తిచేసి విద్యార్థులను ప్రమాదాల బారినుండి కాపాడాలని ఎంఈఓ తారాసింగ్‌ను ఆదేశించారు. సురక్షితమైన గదులలో విద్యను బోధించాలని ఈనిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని, నూతన భవనాన్ని ప్రభుత్వ అనుమతులతో నిర్మాణం కొనసాగించాలని ఎంఈఓ తారాసింగ్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో మండల్ లీగల్ సర్వీస్ న్యాయవాది స్వరూపరాణి, ఎంఈఓ తారాసింగ్, పిఆర్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి సామ్యనాయక్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



పాఠశాల కూల్చివేతపనులను పరిశీలిస్తున్న న్యాయమూర్తి ఎం.హేమలత

## వాహనదారులకు ఇబ్బందిలేకుండా వ్యాపారాలు చేసుకోవాలి

-గజ్వేల్ ట్రాఫిక్ సిఐ మురళి



రోడ్డుపై పెట్టిన సామాన్లను తీయిస్తున్న ట్రాఫిక్ సిఐ మురళి

**గజ్వేల్ టౌన్, అక్టోబరు 25, ప్రభాతవార్త:**
రోడ్డుపై వెళ్లే ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా వ్యాపారాలు చేసుకోవాలని గజ్వేల్ ట్రాఫిక్ సిఐ మురళి సూచించారు. శనివారం గజ్వేల్ పట్టణంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వ్యాపారస్థులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సిఐ మురళి మాట్లాడుతూ గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్‌లోని ప్రధాన రహదారుల్లో వ్యాపారస్థులు ఫుట్‌పాత్‌పై, రోడ్డుపై సామాన్లు పెట్టి, షాపులకు సంబంధించిన ఫ్లెక్సీలను రోడ్డుపై పెట్టడం వల్ల నడుచుకుంటూ వెళ్లే ప్రజలకు, వాహనదారులకు చాలా ఇబ్బందులు కలుగుతున్నాయని అన్నారు. వ్యాపారస్థులు తమ సామాన్లను రోడ్డుపై పెట్టవద్దని, షాపు స్థలం వరకు మాత్రమే దుకాణాలు పెట్టుకొని వ్యాపారం చేసుకోవాలని సూచించారు. నిబంధనలు పాటించని వ్యాపారస్థులపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి తగుచర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ సిఐ మురళి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న రేషన్‌బియ్యం పట్టివేత



డిసిఎం వాహనంలో అక్రమంగా తరలిస్తున్న పిడిఎస్ బియ్యం

**కొల్చారం, అక్టోబరు 25, ప్రభాతవార్త:**
జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు ఆదేశాలమేరకు సిసిఎస్ ఇన్స్పెక్టర్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడిచేసి అక్రమంగా తరలిస్తున్న పిడిఎస్ బియ్యం పట్టుకున్నారు. కొల్చారం మండలం పోతన్‌శెట్టిపల్లి గ్రామ పరిధిలోని ఏడుపాయల టీజంక్షన్ వద్ద అక్రమంగా తరలిస్తున్న 370 పిడిఎస్ బియ్యం సంచులు (ఒక్కోసంచి 50కిలోలు) తీసుకెళ్తున్న డిసిఎం వాహనాన్ని ఆపి పట్టుకున్నారు. పట్టుబడిన వాహనం, బియ్యం సంచులను కొల్చారం పోలీస్ స్టేషన్‌కు అప్పగించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదన్నారు. ఇటువంటి చర్యలపై ఎల్లప్పుడూ పోలీసుల నిఘా కొనసాగుతుందన్నారు. అదేవిధంగా ప్రజలు కూడా ఇలాంటి అక్రమ కార్యకలాపాల గురించి సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు కోరారు.

## రోడ్డు పక్కన బావిలోపడి వ్యక్తి మృతి

-నెలరోజుల క్రితమే వార్త హెచ్చరించినా పట్టింపులేదు

**మనూర్, అక్టోబరు 25, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని మైకోడ్ గ్రామానికి చెందిన వ్యక్తి ద్విచక్ర వాహనంపై వెళుతూ ప్రమాదవశాత్తు రోడ్డుకు పక్కనే ఉన్నబావిలో పడి మృతిచెందిన సంఘటన మాయికోడ్ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది ఇందుకు సంబంధించి గ్రామస్థుల కథనం ప్రకారం, వివరాలు ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని మాయికోడ్ గ్రామానికిచెందిన దత్తు(40) ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తూ ప్రమాదకరంగా మారిన రోడ్డు పక్కనగల బావిలోపడి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు సంఘటన స్థలానికి చేరుకుని శవంతో రోడ్డుపై ఆందోళనకు దిగారు. మండల కేంద్రమైన మనూర్‌కు పోయే రోడ్డులో ఓ వైపు వాగు, మరో వైపు బావి ఉంది. ఇటీవల కురిసిన భారీవర్షాలకు రోడ్డు కుంగిపోవడంతో అటుగా ప్రయాణించే వాహనచోదకులు, ప్రయాణికులు పడుతున్న పాట్లను సెప్టెంబరు 27న భారీవర్షాలతో కోతకు గురవుతున్న రోడ్డు మనూరుకు పోయేందుకు 10గ్రామాలవారికి ప్రయాస, మరమ్మతులు చేయాలని వేడుకోలు శీర్షికతో రోడ్డు దుస్థితిపై కథనాన్ని ప్రచురించినా, అధికారులు కాని, పాలకులుకాని పట్టించుకోకపోవడంతో నిండుప్రాణానికి నూరేళ్లు నిండాయి. క్షతగాత్రులు అవుతూ, ప్రాణాలుపోతున్నందున సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని డిమాండ్ చేస్తున్నారు.

## ఎర్రరాయి గనులపై అధికారుల దాడులు

-హిటాచీని స్వాధీనం చేసుకున్న పోలీసులు



అక్రమంగా నిర్వహిస్తున్న ఎర్రరాయి గనులను పరిశీలిస్తున్న అధికారులు

**న్యాల్‌కల్, అక్టోబరు 25, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని గణేష్‌పూర్ గ్రామ శివారులో అక్రమంగా నిర్వహిస్తున్న మైనింగ్ గనులపై శనివారం రెవిన్యూ అధికారులు, పోలీసులు దాడులు నిర్వహించారు. అక్రమంగా ఎర్రరాయిని తీస్తున్న హిటాచి బుల్డోజర్‌ను స్వాధీనం చేసుకుని పోలీసుఠాణాకు తరలించారు. ప్రభుత్వ నిబంధనలు తుంగలోతొక్కి అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్న వ్యక్తులపై కఠినచర్యలు తప్పవని ఆర్‌డిఓ దేవజ హెచ్చరించారు. దాడులు చేసిన వారిలో ఆర్‌డిఓతో పాటు డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి, ఆర్‌ఐ శ్యామ్‌రావు, గణేష్‌పూర్ ఇపిఓ పీరప్ప, పోలీసు సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కంటైనర్

-ఒకరి మృతి-ఇద్దరికి గాయాలు

**కంది, అక్టోబరు 25, ప్రభాతవార్త:**
ద్విచక్ర వాహనాన్ని కంటైనర్ ఢీకొన్న సంఘటనలో ఒకరు అక్కడికి అక్కడే మృతిచెందిన సంఘటన శనివారం కంది జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. సంగారెడ్డి రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. పాత కందికి చెందిన కాశిపురం దుర్గయ్య (62) మరో ఇద్దరితో కలిసి ద్విచక్ర వాహనంపై కొత్త కంది వైపుకు వెళుతున్న క్రమంలో సిసిఎస్ పోలీసుఠాణా ఎదురుగా ఉన్న యూటర్న్ వద్ద బైకును మలుపు తిప్పుతున్న తరుణంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన కంటైనర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో దుర్గయ్య అక్కడికక్కడే మృతిచెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. సంగారెడ్డి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## భవన్స్ ఆత్మకూరి రామారావు పాఠశాలలో 'ఉడాన్' వేడుకలు


ఉడాన్ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

**జూబ్లీహిల్స్, అక్టోబరు 25, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్‌లోని భారతీయ విద్యాభవన్స్ పబ్లిక్ స్కూల్ ఆత్మకూరి రామారావు పాఠశాలలో శనివారం ఉడాన్ వేడుకలను నిర్వహించారు. లివ్ ఇన్ హార్మోనీ, రూల్ ఆఫ్ ది జంగిల్ పేరుతో ఈ వేడుకలను నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థుల సంస్కృతిక ప్రదర్శనుల విశేషంగా ఆకట్టుకున్నాయి. తొండి గణపతి పాట, జంగిల్ జంగిల్ పతా చలా హై అంటూ నృత్యాలు చేసి చిన్నారులు ఆకట్టుకున్నారు. స్నేహం, ఐక్యతలను వివిధ పద్దతుల ద్వారా విద్యార్థులు ఇక్కడ ప్రదర్శించారు. జంతువుల ఆత్మకథ, స్నేహమే జీవితం, అవని-ది టైగర్ పేరుతో మూడు భాషల్లో రూపకల్పన చేసిన కార్యక్రమం ఆహుతులను ఆకట్టుకుంది. నెమలి నృత్యం, గిరిజన నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థుల్లో దాగి ఉండే సృజనాత్మకతను, కళలన బయటకు తీసేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటుచేసినట్లు పాఠశాల ప్రిన్సిపల్ శ్రీలతా నాయర్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ రాంమోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## వాకర్స్ పాండేషన్ ట్రస్ట్ ఇంటర్నేషనల్ సేవలు ఎంతో గొప్పవి

**వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లింగా ప్రకాష్**


విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి ఎం.అశోక్ ను సత్కరిస్తున్న వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లింగా ప్రకాష్, రామలింగేశ్వర రావు, నిరంజన్ రెడ్డి తదితరులు

**చిక్కడపల్లి అక్టోబర్ 25 ప్రభాతవార్త:** వాకర్స్ పాండేషన్ ట్రస్ట్ ఇంటర్నేషనల్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా విపత్తు సమయాలలో విరాళాలిచ్చి ఆదుకుంటున్న వారిని గుర్తించి గౌరవించడం మంచి సంప్రదాయమని వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లింగా ప్రకాష్ అన్నారు. శనివారం బాగ్ లింగంపల్లి సుందరయ్య పార్క్ లో వాకర్స్ ఇంటర్నేషనల్ మహాత్మా గాంధీ ఫెలోషిప్ సభ్యత్వం కింద రూ. 10 వేలు చెల్లించి సభ్యత్వం తీసుకుని, సేవా సభ్యులుగా కొనసాగుతున్న విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి ఎం.అశోక్ సత్కరించి అభినందించే కార్యక్రమ రామలింగేశ్వర రావు ఆధ్వర్యంలో జరిగింది. ట్రస్ట్ కార్యవర్గ సభ్యుల సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ అఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్షుడు పివి.నిరంజన్ రెడ్డి, డిస్ట్రిక్ట్ గవర్నర్ లింగా ప్రకాశం, చీఫ్ అడ్వైసర్, పిఆర్ఓ రామలింగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

## వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ వార్షిక నివేదిక అందజేత


వాకర్స్ క్లబ్ అఫ్ హైదరాబాద్ సెంట్రల్ వార్షిక నివేదికను గవర్నర్ లింగా ప్రకాష్‌కు అందజేస్తున్న క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పివి.నిరంజన్ రెడ్డి, ఎస్.మనోహర్ రెడ్డి

**చిక్కడపల్లి అక్టోబర్ 25 ప్రభాతవార్త:** వాకర్స్ క్లబ్ అఫ్ హైదరాబాద్ సెంట్రల్ నిర్వహించిన కార్యక్రమాలకు సంబంధించిన నివేదికను అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పివి.నిరంజన్ రెడ్డి, ఎస్.మనోహర్ రెడ్డి వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ లింగా ప్రకాష్ కు అందించారు. శనివారం బాగ్ లింగంపల్లి సుందరయ్య పార్క్ లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో నివేదికను అందించారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ సంవత్సర కాలంగా తమకు కార్యక్రమాల నిర్వహణకు సంపూర్ణ సహకారాన్ని అందించిన వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎస్.మురళి కృష్ణ, పూర్వ ఏరియా వైస్ ప్రెసిడెంట్ సంపత్ రెడ్డి, దామోదర్ రెడ్డి, గంధాధర్, శైలజ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## రిటైర్మెంట్ ఉద్యోగులకు బెనిఫిట్స్ చెల్లించాలి

### -11న పెన్షనర్ల జెఏసి ధర్నా


సెక్రటేరియట్ వద్ద మాట్లాడుతున్న చైర్మన్ లక్ష్మయ్య,సత్యనారాయణ తదితరులు

**హైదరాబాద్, అక్టోబరు 25,ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలు పరిష్కరించకుంటే నవంబర్ 11న ధర్నా నిర్వహిస్తామని తెలంగాణ ప్రభుత్వ పెన్షన్‌దారుల జెఏసీ ప్రకటించింది. ఈమేరకు శుక్రవారం సెక్రటేరియట్ వద్ద చైర్మన్ కె.లక్ష్మయ్య మీడియాతో మాట్లాడుతూ ఏప్రిల్ 2024 నుండి పదవీ విరమణ చేసిన పెన్షనర్లకు వారికి రావలసిన పెన్షనరీ బెనిఫిట్స్ సకాలంలో రాక అప్పు లు కట్టలేక, పిల్లల పెళ్ళిళ్ళు, చదువులు ఆగిపోయి అవమాన భారంతో కొందరు ఆత్మహత్యలు చేసుకుంటుండగా మరికొందరు వృద్ధాప్యంలో అనేక రకాల రుగ్మతలతో ఇబ్బందిపడుతున్నారన్నారు. ఇవన్నింటికి ప్రభుత్వం సకాలంలో పెన్షనరీ బెనిఫిట్స్ 20 నెలలుగా చెల్లించకపోవటమే కారణమని ఇవి ప్రభుత్వ హత్యలని భావిస్తున్నామన్నారు. కావున ప్రభుత్వం ప్రభుత్వం స్పందించి పదవీ విరమణ చేసిన పెన్షనర్లందరికి వారికి రావలసిన పెన్షనరీ బెనిఫిట్స్ (జి.పి.యఫ్, జి.ఎల్.ఐ., గ్రాట్యుటీ, కమ్యుటేషన్ మరియు లీవ్ ఎస్ క్యాష్మెంట్ మొదలగునవి నవంబర్ 10లోగా చెల్లించాలని లేనిపక్షంలో నవంబర్11న ఇందిరాపార్కు వద్ద బాధిత పెన్షనర్ల కుటుంబ సభ్యులతో కలిసి "ధర్నా" నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈసమావేశంలో సెక్రటరీ జనరల్ తులసి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

### జంటనగరాల బాలబాలికలకు వివిధ అంశాలపై ప్రతిభాపాటవ పోటీలు

**చిక్కడపల్లి, అక్టోబరు 25 ప్రభాతవార్త:** బాలానందంట్రస్ట్ ఆధ్వర్యంలో 86 వార్షికోత్సవం సందర్భంగా నవంబరు 9వ తేదీ నుంచి జంటనగరాల బాలబాలికలకు వివిధ అంశాలపై ప్రతిభాపాటవ పోటలు నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ వివరించింది. నారాయణగూడలోని ట్రస్ట్ ఆవరణలో జరిగే ఈ కార్యక్రమాలకు సంబంధించి ఇతర వివరాలకు 8121023248 ద్వారా ఇతర వివరాలు పొందవచ్చన్నారు. నర్సరీ నుంచి 9వ తరగతి చదువుతున్న బాలబాలికలు ఈ పోటీలలో పాల్గొనడానికి అర్హులు అని అన్నారు. నర్సరీ రైమ్స్(తెలుగు), నీతిపద్యాలు, భక్తిగీతాలు, లలిత గీతాలు, సినిమా పాటలు, కర్ణాటక సంగీతం, రామదాసు కీర్తనలు, అన్నమాచార్య కీర్తనలు, చిత్రలేఖనం, కూచిపూడి, భరతనాట్యం, భక్తిగీతాలు తదితర అంశాలలో పోటీలుంటాయన్నారు. ఈ పోటీలలో గెలుపొందిన వారికి త్వరలో జరగబోయే వార్షికోత్సవం సందర్భంగా బహుమతులు అందజేస్తారు.

## ఆత్మీయతకు అనుబంధానికి ప్రతీక భారతీయ సంస్కృతి : సిరికొండ మధుసూదనాచారి


సేవాభారతి పురస్కారాలందజేస్తున్న మధుసూదనాచారి, దైవజ్ఞశర్మ, ఎం.లక్ష్మి, సతీష్, పిఎంకె.గాంధీ తదితర అతిథులు

**రవీంద్రభారతి, అక్టోబరు 25 ప్రభాతవార్త :** భారతీయ సంస్కృతి అంటే ఆత్మీయతకు, అనుబంధానికి ప్రతిరూపమైన సంప్రదాయమన్న తెలంగాణ తొలి శాసనసభ సభాపతి, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, సమాజంలో మారుతున్న స్థితిగతులనే కాకుండా సదాచారాలను సత్ సంప్రదాయాలు, భారతీయ సంస్కృతి, ఆచార వ్యవహారాలు, మన కళలు, కట్టు బొట్టులను ముందుకు తీసుకువెళ్లాల్సిన బాధ్యత ప్రభుత్వం, సాంస్కృతిక సంస్థలతోపాటు మనందరిపైనా ఉందని అన్నారు. ప్రముఖ సాంస్కృతిక, సామాజిక స్వచ్ఛంద సేవాసంస్థ ఉజ్వల ఆధ్వర్యంలో సంస్థ 8వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని రవీంద్రభారతి ప్రధాన మందిరంలో ఆల్‌ఇండియా కల్చరల్ అండ్ డాన్స్‌ఫెస్ట్ శోభాయమానంగా నిర్వహించారు. సంస్థ అధ్యక్షురాలు ఎం.లక్ష్మి నేతృత్వంలో సీనియర్ పాత్రికేయుడు ఎన్.సత్యనారాయణ యాదవ్ (సతీష్) పర్యవేక్షణలో సరస్వతి ఉపాసకుడు దైవజ్ఞశర్మ సభాధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సిరికొండ మధుసూదనాచారి విశిష్ట అతిథులు డా. శివనరసింహన్‌స్వామి, అనిల్‌యాదవ్, టి.సామ్యూల్, బి.సత్యనారాయణ, బ్రహ్మశ్రీ ప్రదీప్‌కుమార్ తంత్రి తదితరులతో కలిసి ఉభయ తెలుగురాష్ట్రాల్లో వివిధరంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న 10మంది ప్రముఖులను, ఆరుగురు సుప్రసిద్ధ సంగీత నాట్య గురువులను సత్కరించి సేవాభారతి పురస్కారాలను ప్రదానం చేసి సమాజానికి వారి సేవలను ప్రశంసించారు. సభకుముందు యువకళాకారుల శాస్త్రీయ, సంప్రదాయ నృత్యాలు ఆహుతులను అబ్బురపరిచాయి.

# రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రాజీనామా చేయాలి

**ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్**


బస్సు ప్రమాద మృతులకు కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న డాక్టర్ దిడ్డి సుధాకర్ తదితరులు

**ముషీరాబాద్, అక్టోబర్ 25, ప్రభాతవార్త:** కర్నూల్ వద్ద జరిగిన ఘోర బస్సు ప్రమాదానికి బాధ్యత వహిస్తూ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తన పదవికి రాజీనామా చేయాలని ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ డిమాండ్ చేశారు. శనివారం రాత్రి ట్యాంక్‌బండ్‌పైనున్న అంబేద్కర్ విగ్రహం వద్ద మృతులకు కొవ్వొత్తులతో ఆప్ శ్రేణులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ ట్రావెల్ మాఫియాను ప్రోత్సహిస్తున్నది ప్రభుత్వమేనని ధ్వజమెత్తారు. ప్రైవేట్ ట్రావెల్ బస్సు సర్వీసులను నిషేధించాలని డిమాండ్ చేశారు. లంచాలకు అలవాటుపడి, హైదరాబాద్ నుండి బయలుదేరే ట్రావెల్స్ బస్సుల భద్రతా ప్రమాణాల అమలుపై పర్యవేక్షణ లేకపోవటం ప్రభుత్వ వైఫల్యమేనని అన్నారు. కర్నూల్ ప్రమాదానికి కారణమైన వారితో పాటు వేమూరి కావేరి ట్రావెల్స్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని, మృతి చెందిన కుటుంబాలకు కోటి రూపాయల నష్ట పరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆప్ రాష్ట్ర నాయకులు బుర్ర రాముగౌడ్, విజయ్ ముల్లంగి, హేమ జిల్లోజు, జావీద్ షరీఫ్, దర్శనం రమేస్, రమ్యగౌడ్, రాకేష్ సింగ్, అలీ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్లు,పుట్‌ఫాత్‌లు ఆక్రమిస్తే కఠిన చర్యలు

**-నార్త్‌జోన్ ట్రాఫిక్ 1 ఎసిపి శంకరరాజు**


భగవంతాపూర్ బస్తీ రోడ్డులో ఫుట్‌ఫాత్‌పై వెలిసిన డబ్బాల తొలగింపు.

**బేగంపేట అక్టోబరు 25,ప్రభాతవార్త** వాహనాలు ప్రయాణించే రోడ్లు,ఫుట్‌ఫాత్‌లు ఆక్రమిస్తే కఠిన చర్యలు చేపడతామని నార్త్‌జోన్ ట్రాఫిక్ 1ఏసీపీ జి.శంకరరాజు హెచ్చరించారు.నార్త్‌జోన్ పరిధిలోనిఅన్ని ప్రాంతాల్లో ఆపరేషన్ రోప్ ను విజయవంతం చేస్తామని ఆయన తెలియజేసారు.ఫుట్‌ఫాత్‌ల ఆక్రమణ వల్ల 33శాతం పాదచారులు ప్రాణాలు కోల్పోతున్నారని,వారి రక్షణ కోసం ప్రతి ఫుట్‌ఫాత్‌ను రక్షిస్తామని,వారికి నడిచేందుకు అనుకూలంగా చర్యలు చేపడతామని ఆయన అన్నారు. బేగంపేట విమానాశ్రయం పక్కనే ఉన్న భగవంతాపూర్ బస్తీలో ఫుట్ ఫాత్ ఆక్రమణలను తొలగించామని, బేగంపేటలోని మిగిలిన అన్ని ప్రాంతాల్లోని ఫుట్ ఫాత్ ఆక్రమణలను తొలగించనున్నట్లు ట్రాఫిక్ ఏసీపీ తెలియజేసారు.బేగంపేట ప్రధాన రోడ్డుతో పాటు వివిధ బస్తీల్లో ఆక్రమణ చెరలో ఉన్న ఫుట్‌ఫాత్‌లను రక్షిస్తామని ఆయన తెలియజేసారు.ఉత్తర మండలం పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఫుట్‌ఫాత్‌లను పాదచారులు నడిచేందుకు వీలుగా అందుబాటులోకి తీసుకువస్తామని ఏసీపీ తెలియజేసారు.

## ఎంటిఏఆర్ టెక్నాలజీస్ లిమిటెడ్ కంపెనీ యూనియన్ ఎన్నికల్లో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ విజయం

**కూకట్‌పల్లి, అక్టోబర్ 25, ప్రభాతవార్త** బాలానగర్ పారిశ్రామికవాడలో ఉన్న ఎంటీఏఆర్ టెక్నాలజీస్ లిమిటెడ్ కంపెనీలో జరిగిన యూనియన్ ఎన్నికల్లో భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ తరపున పోటీ చేసిన మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ విజయం సాధించారు. శనివారం కంపెనీలో జరిగిన గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో వి.శ్రీనివాస్ గౌడ్ పోటీ చేసి సమీప బిఎంఎస్ అభ్యర్థి మెదక్ పార్లమెంటు సభ్యులు రఘునందన్ రావుపై ఆరు ఓట్ల తేడాతో ఘన విజయం సాధించారు. పోటీలో పాల్గొన్న శ్రీనివాస్ గౌడ్‌కు 193 ఓట్లు రాగా, పి రఘునందన్ రావుకు 187 ఓట్లు, అలాగే సిఐటియు అభ్యర్థికి 83 ఓట్లు పోలయ్యాయి. ఈ కార్యక్రమంలో చిట్టి రెడ్డి శ్రీధర్ రెడ్డి, రమేష్ యాదవ్, అక్కిరెడ్డి, మాయ బాల నర్సయ్య, కిరణ్, రాజేష్, సుధాకర్, కిశోర్, ఇతర కార్మిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పేద రోగుల సహాయకులకు అన్నదానం


అన్నదానం చేస్తున్న అసద్,అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్,టిఎన్‌జిఓ కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ఎస్.ఎం.ముజీబ్‌హుస్సే నీ

**గన్‌ఫౌండ్రి, అక్టోబర్ 25 ప్రభాతవార్త:** అసద్,అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వైద్యం కోసం పేద రోగులకు ఉచితంగా అన్నదానం చేశారు.ఎం.ఎన్.జె క్యాన్సర్ ఆసుపత్రి ఆవరణలో సుమారు 400 మంది పేదరోగులకు ట్రస్ట్ చైర్మన్,ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం.ముజీబ్‌హుస్సేనీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలనుంచి పేద రోగులకు ప్రతినెల మూడు వారాలపాటు అన్నదానం చేయడం,ముఖ్యంగా ముజీబ్ తల్లిదండ్రుల పేరిట అన్నదానం చేయడం పట్ల సంతోషదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో టిఎన్‌జిఓ అసోసియేట్ అధ్యక్షులు కె.ఆర్. రాజ్‌కుమార్,ఎం.ఎన్.జె క్యాన్సర్ అధ్యక్షులు బి.శివకుమార్,కార్యదర్శి చంద్రశేఖర్,ఇఎన్‌టి రాజు పాల్గొన్నారు.


సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు నూతన సిఈఓగా బాధ్యతలు స్వీకరించిన అరవింద్ కుమార్ ద్వివేదిని శనివారం బోర్డు మాజీ సభ్యులు జె.ఎం.ఆర్, పాండు యాదవ్, శ్యామ్ నళిని కిరణ్, అనితా ప్రభాకర్‌లు మర్యాదపూర్వకంగా కలిసి శాలు కప్పి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియస్తున్న దృశ్యం

## తాతా అర్జున్ పహిల్వాన్ ఆదర్శం

**: యువ మల్లయోధుడు ఐతన్ ఆర్యన్ యాదవ్**


బంగారు పతకం సాధించిన ఆర్యన్‌యాదవ్‌ను అభినందిస్తున్న దృశ్యం

**బేగంబజార్,అక్టోబర్ 25ప్రభాతవార్త:** ఇటీవల జరిగిన హైదరాబాద్ జిల్లా గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన కుస్తీ పోటిలల్లో గొల్లకిడికి జైభవానినగర్ ప్రాంతానికి చెందిన జై భవాని వ్యాయంశాలకు చెందిన యువ మల్లయోధుడు ఐతన్ ఆర్యన్‌యాదవ్ అండర్19 రాష్ట్ర స్థాయి చాంపియన్ షిప్ పోటిలో తన సమీపం ప్రత్యర్థిపై గెలిచి బంగారు పతకాన్ని సాధించారు.ఈ పోటిలో గెలిచిన యువ మల్లయోధుడు ఐతన్ ఆర్యన్ యాదవ్ మాట్లాడుతూ కుస్తీపోటిలలో రాణించడానికి తన తాత ఐతన్ అర్జున్‌యాదవ్ ఆదర్శమన్నారు.పలువురు మల్లయోధులు ఆర్యన్ యాదవ్‌ను అభినందించారు. జైభవానీ వ్యాయంశాల నిర్వాహకులు మల్లయోధుడు అర్జున్‌యాదవ్,జైహింద్‌యాదవ్,అభిమన్యుయాదవ్‌ల పర్యవేక్షణలో ఎంతో మంది యువకులకు కుస్తీ పోటిలల్లో శిక్షణ ఇస్తుంటారు.నేటి యువత విద్యతోపాటు క్రీడల్లో రాణిస్తే సమాజంలో మంచి గుర్తింపు వస్తుందన్నారు.అందరు గౌరవిస్తారన్నారు.

## నిరాకరించిందని నిర్దాక్షణ్యంగా చంపేశాడు

**- అసోం యువతిపై హత్యాచారం.. నిందితుడు అరెస్ట్**

**జూబ్లీహిల్స్, అక్టోబరు 25, ప్రభాతవార్తః** లైంగిక చర్యకు నిరాకరించిందని అసోంకు చెందిన ఒక మహిళపై దాడి చేసి అత్యాచారానికి పాల్పడి హత్య చేసిన నిందితుడిని పంజాగుట్ట పోలీసులు అరెస్ట్ చేశారు. పంజాగుట్ట ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ కథనం ప్రకారం.. ఈ నెల 23న బేగంపేటలోని ఇంపీరియల్ హౌజ్ అపార్ట్‌మెంట్స్ ఎదురుగా శ్రీసత్య టిఫిన్ అండ్ మీల్స్ సెంటర్ వద్ద ఒక మహిళ స్పృహ తప్పి పడి ఉండటాన్ని అక్కడే టీ స్టాల్ నిర్వహించే పోతమచెట్టి పండు గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. లీసా(35)గా పోలీసులు అమెను గుర్తించారు. అప్పటికే ఆమె మృతి చెంది ఉండటంతోపాటు ఆమె శరీరంపై గాయాలుండటం, పక్కనే మద్యం సీసాలు ఉండటంతో హత్య కేసుగా నమోదు చేసి శవపంచానామా నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టిన పంజాగుట్ట పోలీసులు అనంతపురం జిల్లా నల్లచెరువు మండలం ఎనమల్లపల్లి గ్రామానికి చెందిన వై. రెడ్డప్ప(38)గా గుర్తించారు. 22న రాత్రి 11.45 గంటల ప్రాంతంలో గ్రీన్‌ల్యాండ్స్ వద్ద ఒంటరిగా ఉన్న లీసాను పలకరించిన రెడ్డప్ప ఇద్దరు కలిసి సమీపంలోని నిర్జన ప్రాంతానికి వెళ్లి అక్కడ మద్యం సేవించారు. అనంతరం ఆమెతో లైంగిక చర్యకు పాల్పడ్డాడు. మరోసారి ప్రయత్నించగా లీసా నిరాకరించింది. దీంతో కోపోద్రిక్తుడైన రెడ్డప్ప ఆమెపై దాడికి పాల్పడి గొంతు నులిమి అత్యాచారం చేసి అనంతరం ఆమెను హతమార్చి అక్కడి నుంచి పరారైట్లు విచారణలో అంగీకరించాడు. కేసును ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేసిన ఎస్సైలు సురేష్, నరేష్, కానిస్టేబుల్ రవికుమార్, హోంగార్డు ఆనంద్‌లను ఆయన అభినందించారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

## నిమ్స్ వైద్యవిద్యార్థినిని వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

**జూబ్లీహిల్స్, అక్టోబరు 25, ప్రభాతవార్తః** నిమ్స్ ఆసుపత్రిలో పనిచేస్తున్న ఓ వైద్య విద్యార్థినిని వేధిస్తున్న వ్యక్తిపై పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పంజగుట్ట పోలీసుల కథనం ప్రకారం.. నిమ్స్ ఆసుపత్రిలో పీజీ చివరి సంవత్సరం చదువుతున్న ఒక వైద్య విద్యార్థిని(30) ప్రార్థనకు వెళ్లిన సమయంలో ఏసుదాసు ఇమ్మరాజు అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలోనే ఆమె ఫోన్ నంబరు తీసుకున్న ఏసుదాసు ఆమెను ఫోన్‌కాల్స్, అసభ్యకర సందేశాలతో, నిత్యం వెంటపడుతూ వేధిస్తున్నాడు. ఇంటికి వెళ్లినా, ఆసుపత్రికి వెళ్లిన వెంబడిస్తుండటంతో ఆమె కొద్ది రోజుల కిందట కీసర పోలీస్ స్టేషన్లో సైతం ఫిర్యాదు చేసింది. అదేది లెక్కచేయకుండా వెంటపడటంతోపాటు బహుమతులు, ఆహారాన్ని హాస్టల్‌కు, పనిచేసే ప్రాంతానికి పంపుతున్నాడు. ఈ మేరకు వైద్య విద్యార్థిని పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులుకేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మెరుగైన చికిత్సకు ఆదేశం...ఎంతటి ఖర్చైనా వెనకాడేది లేదు

## మంత్రి అడ్లూరి లక్ష్మణ్


యశోద హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న హిమేష్‌ను పరామర్శించిన సోషల్ వెల్ఫేర్ మంత్రి అడ్లూరి లక్ష్మణ్

**సికింద్రాబాద్, అక్టోబర్ 25, ప్రభాతవార్త** యశోద హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న జగిత్యాల జిల్లా ధరూర్ క్యాంపు హాస్టల్ విద్యార్థి హిమేష్‌ను షెడ్యూలు కులాల అభివృద్ధి శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ శనివారం సాయంత్రం పరామర్శించారు. చికిత్స పొందుతున్న హిమేష్‌కు అందుతున్న వైద్య సేవలు గురించి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఆసుపత్రి వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. హిమేష్‌కు మెరుగైన సేవలు అందించాలని, ఎంతటి ఖర్చైనా భరిస్తామని ఈ సందర్భంగా ఆసుపత్రి యశోద హాస్పిటల్స్ డైరెక్టర్ పవన్ కుమార్ గోరుకంటికి మంత్రి లక్ష్మణ్ తెలిపారు. ఇదిలా ఉండగా పిడుగుపాటుతో తీవ్ర గాయాల పాలైన హిమేష్‌ను మెరుగైన చికిత్స కోసం మంత్రి ఆదేశంతో సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తీసుకువచ్చిన విషయం తెలిసిందే. చికిత్స కోసం ఆస్పత్రికి తీసుకువచ్చిన వెంటనే కమిషనర్ ఎన్.క్షితిజ పరామర్శించిన విషయం తెలిసిందే. అత్యవసర చికిత్స నిమిత్తం యాజమాన్యానికి 5 లక్షల రూపాయలను మంజూరు చేసిన విషయం తెలిసిందే. జగిత్యాల జిల్లా ధరూర్ క్యాంపు ఎస్సీ హాస్టల్ విద్యార్థి హిమేష్ పిడుగుపాటు ప్రమాదంలో గాయపడటం బాధాకరమని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. హిమేష్‌కు అండగా ఉంటామని, కలత చెందవద్దని హిమేష్ తల్లిదండ్రులకు మంత్రి లక్ష్మణ్ ధైర్యం చెప్పారు. ఎస్సీడిడి అడిషనల్ డైరెక్టర్ సి.శ్రీధర్, హైదరాబాద్ డిడి ప్రవీణ్ రెడ్డి, ఏడి శ్రీనివాస్, ఉప్పు సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

# కాంగ్రెస్ రైతుల ప్రభుత్వం : మంత్రులు


ఎర్రగడ్డ రైతు బజారులో కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి.

**యూసుఫ్‌గూడ, అక్టోబర్ 25, ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ రైతుల ప్రభుత్వం అనీ ప్రజా సంక్షేమం కోసం ఎన్నో పథకాలు అమలు చేయడం జరిగిందని మంత్రులు పొన్నం ప్రభాకర్ వివేక్ వెంకట స్వాములు అన్నారు. శనివారం జూబ్లిహిల్స్ నియోజక వర్గంలోని ఎర్రగడ్డ రైతు బజారులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని రైతులను అభ్య ర్థించారు. కూరగాయల ధరలు ఎలా ఉన్నాయి.పంటదిగుబడి ఎలా ఉం ది, లాభాలు ఎలా వస్తున్నాయి, అనీ రైతులతో అప్యాయంగా పలుకరించి వారితో ముచ్చటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ప్రభుత్వం అనీ ఎప్ప టికి రైతులకు అండగా నిలుస్తుందని జూబ్లిహిల్స్ నియోజక వర్గంలో అన్నివ ర్గాల మద్దతు కాంగ్రెస్‌కే ఉందని పేర్కొన్నారు. అదేవిధంగా యూసుఫ్ గూడలో ఇంటింటికి ప్రచారం నిర్వహించి ఓట్లను అభ్యర్థించారు. యూసుఫ్‌గూడ ప్రధాన రహదారిలో మంత్రి పొన్నం ప్రభాకర్ ఆటో కార్మికులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకుని ఆటోను స్వయంగా నడిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఆటో డ్రైవర్లుకు సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఎమ్మేల్యే శంకరయ్య, శివసేన రెడ్డి, గిరిధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కళలు పిల్లల సమగ్ర వ్యక్తిత్వవికాసానికి తోడ్పడుతాయి

**: ప్రముఖ వాగ్గేయకారుడు డా. శ్రీభాష్యం శ్రవణ్‌కుమార్**


సన్మానిత కళాకారులతో శ్రవణ్‌కుమార్, నరసింహాచార్య, సుష్మ తదితర అతిథులు

**నాంపల్లి, అక్టోబరు 25 ప్రభాతవార్త :** సంగీతం, కళలు, సాంస్కృతిక కార్యకలాపాలు పిల్లల సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి ఎంతగానో తోడ్పడుతాయని ప్రముఖ వాగ్గేయకారుడు డా. శ్రీభాష్యం శ్రవణ్‌కుమార్ అన్నారు. వీటికి వయో పరిమితులు ఉండవని, ఏ వయస్సులకైనా ఒత్తిడిని తగ్గించి మానసిక ప్రశాంతత, మనో ఉల్లాసాన్ని కలుగజేస్తాయని స్పష్టం చేశారు. శ్రీకీర్తనా సంగీత అకాడమీ ఐదవ వార్షికోత్సవ వేడుకలు భారత్ వికాస్ పరిషత్‌లో కన్నులపండువగా జరిగాయి. అకాడమి స్థాపకురాలు, సంగీత గురువు వేదగిరి సుష్మా ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు వీక్షకులను అబ్బురపరిచి ఆకట్టుకున్నాయి. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన శ్రవణ్‌కుమార్, విశిష్ట అతిథులు సాధన నరసింహాచార్య, గురువు సుష్మా తదితరులతో కలిసి నేటి సాంస్కృతిక ప్రదర్శనల్లో పాల్గొన్న కళాకారులను సన్మానించి జ్ఞాపికలు ప్రదానంచేసి శుభాశీస్సులు అందజేశారు.

## భక్తిశ్రద్ధలతో నాగుల చవితి


పూజలు నిర్వహిస్తున్న వినయ్ కుమార్ తదితరులు

**చిక్కడపల్లి అక్టోబర్ 25 ప్రభాతవార్త :** వివేక్ నగర్ లోని పీపుల్స్ పార్క్ లో నాగ దేవత,శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి.. ఆలయాన్ని శనివారం బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్ సందర్శించి నాగుల చవితి పర్వదినం సందర్భంగా అమ్మ వారికి ప్రత్యేక పూజలు ర్వహించారు. కార్యక్రమంలో బిజెపి నేత పి.నర్సింగ్ రావు, ఆలయ పూజారి శ్రీనివాస్, శ్రీమతి జ్యోతి,చంద్రశేఖర్ శర్మ తదితరులు.. పాల్గొన్నారు.

## అవాస్తావాల ప్రచారం చేస్తున్న యూట్యూబర్లపై లీగల్ చర్యలు

**యూసుఫ్‌గూడ, అక్టోబర్ 25, ప్రభాతవార్త :** హెచ్‌కె పర్మనెంట్ మేకప్ క్లినిక్‌పై సోషల్ మీడియా వేదికగా అవస్తావాలు నిరాధారమైన విషయాలు ప్రచారం చేస్తున్న యూటూబ్ చానళ్ళపై న్యాయపరంగా చర్యలు తీసుకుంటామని ఇప్పటికే వారిపై పోలీసులకు ఫిర్యాదు చేశామని హెచ్‌కె పర్మనెంట్ క్లినిక్ వ్యవస్థాపకురాలు హర్షిత వెల్లడించారు. శనివారం ఫిలిం చాంబర్‌లో విలేకరుల సమావేశంలో ఆమె లీగల్ అడ్వైజర్ నాగుర్ బాబుతో కలిసి మాట్లాడారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా వైద్యాన్ని అందిస్తున్నామని తెలిపారు. కొరియా నుంచి తాము ఎక్కువగా వైద్య పరికరాలను దిగుమతి చేసుకుని నిబంధనలు పాటిస్తూనే వైద్యాన్ని చేస్తున్నామని తెలిపారు. డాక్టర్ నర్సింహరావు మాట్లాడుతూ హెచ్‌కె పర్మనెంట్ మేకప్ క్లినిక్‌లో నిష్ణాతులైన వైద్యులతో వైద్యం అందిస్తున్నప్పటికి కొంత మంది కావాలని కుట్రపూరితంగా సోషల్ మీడియా దుష్ప్రచారం చేశారని వారిపై ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈఅంశంపై పోలీసులు విచారణ చేస్తున్నారని కేసు కూడా నమోదు అయిందని తెలిపారు.

## స్వచ్ఛంద సేవా సంస్థలకు సహాయ సహకారాలు ఎల్లవేళల ఉంటాయి : తలసాని



లబ్ధిదారులకు కళ్ళద్దాలను పంపిణీ చేస్తున్న తలసాని,కార్పోరేటర్ కొలను లక్ష్మి తదితరులు

**సంజీవరెడ్డి నగర్,అక్టోబర్ 25 ప్రభాతవార్త:** పేద ప్రజల మేలు కోసం చేపట్టే కార్యక్రమాలతో తన సంపూర్ణ సహాయ సహకారాలు ఉంటాయని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. శనివారం సనత్ నగర్‌లోని ఆదిత్య నగర్ కమ్యూనిటీ హాల్‌లో శ్రీమాతా సేవా సమితి ఆధ్వర్యంలో పలువురికి ఉచితంగా కళ్ళద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక మంది పేదరకం కారణంగా ఆర్థిక ఇబ్బందులతో సరైన వైద్యం పొందలేక పోతున్నారన్నారు. స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలతో పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. శ్రీ మాతా సేవి సమితి దాతల సహకారంతో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టి పేద ప్రజలకు అండగా నిలిచారని అభినందించారు. ఈ కార్యక్రమంలో సనత్ నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మి బాల్‌రెడ్డి, సేవా సవమితి అధ్యక్షురాలు కుసుమ విజయ, నాయకులు రాజేశ్ ముదిరాజ్, షాబాద్ శ్రీనివాస్,సమితి సభ్యులు రమాదేవి,శోభ, రాధిక, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో చాదర్ సమర్పణ


చాదర్‌ను అందజేస్తున్న ప్రతినిధులు

**చార్మినార్,అక్టోబరు 25 ప్రభాతవార్త :** బిహార్ గవర్నర్ ఆరీఫ్ మహ్మద్ ఖాన్ అందజేసిన చాదర్‌ను పాతబస్తీ చార్మినార్ నియోజకవర్గం దారుషిఫా ప్రాంతానికి చెందిన సీనియర్ బిజెపి రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి మీర్‌ఫిరాసత్ అలీ బాక్రీ ఆగ్రాలోని ఖాజీ సయ్యద్ నురూల్లా షుస్తారి (షాహిద్-ఈ-సాలీస్) దర్గాకు సమర్పించారు.ఈ కార్యక్రమంలో ఉత్తర్ ప్రదేశ్ షియా సెంట్రల్ వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అలీ జైదీ,బిజెపి ఆగ్రా మహిళా మోర్చ అధ్యక్షురాలు ఉప్నా గుప్తాతో పాటు పలువురు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

**- అతివేగంగా దూసుకువచ్చి పాదచారిని ఢీకొన్న కారు**

**నార్సింగి, అక్టోబర్ 25 ప్రభాతవార్త :** రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. ఈ విషాదకర సంఘటన నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం హైదర్షాకోట్ గ్రామానికి చెందిన ఎల్లయ్య కుమారుడు అడ్ల కృష్ణ(45) దినసరి కూలీగా పని చేస్తు జీవనం సాగిస్తున్నాడు. శనివారం ఉదయం హైదర్షాకోట్ గ్రామంలోని బొడ్రాయి సమీపంలోని రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తూ స్పృహతప్పి కింద పడ్డాడు. అదే సమయంలో వేగంగా దూసుకు వచ్చిన కియాకారు(టిఎస్13ఇ 9396) అతడి పై నుంచి దూసుకెళ్లింది. ఈ సంఘటనలో తలకు బలమైన గాయాలై, తీవ్ర రక్తస్రావంతో కృష్ణ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. సమాచారం అందుకున్న నార్సింగి పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి మృతదేహంను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారును సీజ్ చేసి, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసును దర్యాప్తు చేస్తున్నామని నార్సింగి పోలీసులు తెలిపారు.

## వ్యవసాయ వర్సిటీలో ముగిసిన పుస్తక ప్రదర్శన

**అత్తాపూర్ అక్టోబరు25, ప్రభాతవార్త :** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం నాలెడ్జ్ మేనేజ్మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించిన వ్యవసాయ పుస్తక ప్రదర్శన శనివారం ముగిసింది. హైదరాబాదు, న్యూఢిల్లీకి చెందిన 8 పుస్తక ప్రచరణ సంస్థలు ఇందులో స్టాళ్ళను ఏర్పాటు చేశారు. రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల చెందిన యూజీ, పీ జీ, పీహెచ్డీ విద్యార్థులు ఈ రెండు రోజుల ప్రదర్శనను సందర్శించారు. దాదాపుగా ఈ రెండు రోజుల్లో 1000 మందికి పైగా విద్యార్థులు ఈ ప్రదర్శనను సందర్శించినట్లు విశ్వవిద్యాలయ గ్రంథపాలకుడు డాక్టర్ వివేకవర్ధన్ తెలిపారు. అలాగే, పలువురు అధ్యాపకులు ఈ ప్రదర్శనను సందర్శించి పలు పుస్తకాలను యూనివర్సిటీ సెంట్రల్ లైబ్రరీలో నూ, వివిధ కళాశాలల లైబ్రరీలోనూ కొనుగోలు చేసేందుకు ప్రతిపాదనలు అందించారు. మొదటి రోజు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ సిహెచ్ విద్యాసాగర్ పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. ఇందులో వ్యవసాయ కోర్సులకు సంబంధించిన, అలాగే వివిధ పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను ఈ ప్రదర్శనలో ఉంచారు. వ్యవసాయ పుస్తక ప్రదర్శనను అసిస్టెంట్ ప్రొఫెసర్ ఇన్ లైబ్రరీ సైన్స్ డాక్టర్ ఎన్ పి రవికుమార్, అలాగే విశ్వవిద్యాలయ గ్రంథపాలకులు డాక్టర్ వివేకవర్ధన్లు సమన్వయపర్చారు.

## బస్టాండ్ హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలు అందుకున్న శ్రీప్రసన్నాంజనేయస్వామి

**నర్సాపూర్, అక్టోబరు 25, ప్రభాతవార్త:**
నర్సాపూర్ పట్టణ బస్టాండ్ సమీపంలోగల హనుమాన్ ఆలయంలో కార్తీకమాస మొదటి శనివారం పురస్కరించుకొని శ్రీప్రసన్నాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి వేద పండితులు గౌడిచెర్ల హరిప్రసాద్‌శర్మ వేదమంత్రాల మధ్యన మొదటగా నవగ్రహపూజ, గణపతిపూజ, శివపూజ, ప్రసన్నాంజనేయ స్వామికి పంచామృతాభిషేకం, సింధూర లేపనం వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులతో భజన కార్యక్రమం, సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం వంటి కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నియమనిష్ఠలతో చేశారు. ఈ సందర్భంగా ఈ ఆలయానికి హాజరైన భక్తులకు తీర్థప్రసాద వితరణ గావించారు. అనంతరం ఆలయ పూజారి వేద పండితులు హరిప్రసాద్‌శర్మ కార్తీకమాస ఆవశ్యకతను ప్రాముఖ్యతను భక్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కుమ్మరి సంజీవ్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## నాచగిరిలో కార్తీకమాస ప్రత్యేక పూజలు



శంఖం, చక్రం, నామాల ఆకృతిలో దీపాలను వెలిగిస్తున్న భక్తులు

**వర్గల్, అక్టోబరు 25, ప్రభాతవార్త:**
వర్గల్‌మండలం నాచగిరి శ్రీలక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో కార్తీకమాసాన్ని పురస్కరించుకొని శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసంలో మొదటి శనివారం కావడంతో వివిధ ప్రాంతాల నుండి భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన భక్తులు స్వామివారి నిత్యాభిషేకాలు, నిత్యకళ్యాణాలు, సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను ఆచరించారు. కాగా రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆదేశాల మేరకు కార్తీకమాస ఉత్సవాల్లో భాగంగా సాయంత్రం శంఖు, చక్ర, నామాల ఆకృతిలో దీపాలు వెలిగించడం జరిగింది. తదుపరి ఆకాశ దీపారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనగా ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి విజయరామారావు, అధికారులు, సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

## బివిఆర్ఐటిని సందర్శించిన బెంగళూరు ప్రొఫెసర్

**నర్సాపూర్, అక్టోబరు 25, ప్రభాతవార్త:**
నర్సాపూర్ పట్టణ సమీపంలోని బివిఆర్ఐటి ఇంజనీరింగ్ కళాశాలలను శనివారం ప్రముఖ సివిల్ ఇంజనీర్ ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సి) బెంగళూరు ప్రొఫెసర్ డాక్టర్ జి.మాధవిలత సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలోని వివిధ ప్రయోగశాలల పనితీరు సౌకర్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విష్ణు విద్యాసంస్థల చైర్మన్ కె.వి.విష్ణురాజు వైస్‌చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి విద్య పరిశోధన సాంకేతిక అభివృద్ధి పలు అంశాలపై చర్చించారు. అటుతర్వాత సివిల్ ఇంజనీరింగ్ విభాగ అధ్యాపకులతో కలిసి ఆధునిక నిర్మాణ సాంకేతికతలపై విశ్లేషణాత్మక చర్చలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సంజయ్ దుబే, డైరెక్టర్ లక్ష్మీప్రసాద్, డాక్టర్ ఎస్.కృష్ణారావు, డాక్టర్ విజయ్‌కుమార్, మేనేజర్ బాపిరాజు, ఎవో సురేష్, ఐఐటి హైదరాబాద్ మహేంద్ర యూనివర్సిటీ, తిరుపతి ఐఐటి విద్యాసంస్థల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## జీవామృతంపై వ్యవసాయ విద్యార్థుల ప్రదర్శన




జీవామృతంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ విద్యార్థులు

**నర్సాపూర్, అక్టోబరు 25, ప్రభాతవార్త:**
నర్సాపూర్ మండలం అవంచ గ్రామంలో లొయోలా వ్యవసాయ కళాశాల విద్యార్థులు సహజ సేంద్రియ ఎరువైన జీవామృతం తయారీ, వినియోగంపై ప్రదర్శననిర్వహించి రైతులకు సేంద్రియవ్యవసాయం ప్రాముఖ్యతను తెలియజేస్తూ జీవామృతం తయారీవిధానం, దానికి అవసరమైన పదార్థాలు, వాడకం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ ప్రదర్శనను గ్రామ రైతులు చురుకుగా పాల్గొని జీవామృతం తయారీని ప్రత్యక్షంగా వీక్షించారు. రసాయన ఎరువులకు ప్రత్యామ్నాయంగా జీవామృతం వాడటం ద్వారా నేల ఆరోగ్యంగా ఉండి మెరుగుపడటమే కాకుండా పంటల ఉత్పాదకత కూడా పెరుగుతుందని లొయోలా వ్యవసాయ కళాశాల విద్యార్థినులు అఖిల, శేషా, ప్రియా, సౌజన్య, సరీనా, దేవిశ్రీ, సహజ సేంద్రియ ఎరువైన జీవామృతం తయారీ, వినియోగంపై ప్రదర్శన నిర్వహించి రైతులకు వివరించారు.

## బాధిత కుటుంబాలకు ఆర్థికసహాయం

**సిద్దిపేట అర్బన్(చిన్నకోడూరు), అక్టోబరు 25, ప్రభాతవార్త:**
చిన్నకోడూరు మండలపరిధిలోని మైలారంగ్రామానికి చెందిన వరదయ్య అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందగా ఈవిషయాన్ని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు దృష్టికి బిఆర్ఎస్‌నాయకులు శనివారం తీసుకెళ్లారు. దీంతో వెంటనే స్పందించిన హరీష్‌రావు బాధితకుటుంబానికి రూ.5వేల ఆర్థికసహాయం పంపించారు. దీంతో మాజీ ఎంపిపి ఉపాధ్యక్షులు కీసర పాపయ్య, బిఆర్ఎస్ నాయకులు కుంటయ్య, సంపంగి సంపత్, నాలువల రాజు, దొంతి పర్శరాములు, బస్వారాజుల చంద్రం, నిమ్మల రవి తదితరులు బాధిత కుటుంబీకులను పరామర్శించి ఓదార్చి ఆర్థికసహాయం అందజేశారు. అలాగే చిన్నకోడూరు మండలపరిధిలోని లారీ-బైక్ ప్రమాదంలో మృతిచెందిన క్రిష్ణ ఈవిషయాన్ని హరీష్‌రావుకు తెలియజేయగా రూ.10వేల ఆర్థికసహాయం పంపించారు. దీంతో గ్రామ మాజీసర్పంచ్ నెమలి సుభాష్ బాధిత కుటుంబీకులను పరామర్శించి, ఓదార్చి ఆర్థిక సహాయం అందజేశారు.

## నిరుపేద వధువుకు బీరువా, పుస్తెమట్టెలు అందజేత

**మర్కుక్, అక్టోబరు 25, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని ఎర్రవల్లి గ్రామానికి చెందిన సోమెల్ల లలిత తన చిన్నకూతురు అనూష వివాహంజరిపిస్తుండగా వారిది నిరుపేద కుటుంబం కావడంతో డొనేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం వారికి పుస్తెమట్టెలను అందజేశారు. అలాగే అదే గ్రామానికిచెందిన నారన్నగారి రాంమోహన్‌రెడ్డి బీరువాను అందజేసి తన సేవాగుణాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు నరేష్‌రెడ్డి, పందరి, బిక్షపతి, రాంమోహన్‌రెడ్డి, అజీజ్, గణేష్, కనకయ్య, నర్సింలు, శ్రీశైలం, సత్యం, కరుణాకర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## కిరాణా షాపులలో డాగ్ స్క్వాడ్ తనిఖీలు



తనిఖీలు చేస్తున్న పోలీసులు

**చిలిపిచెడ్, అక్టోబరు 25 ప్రభాతవార్త:**
మండలంలోని చిట్కుల్ గ్రామ పరిధిలో గల కిరాణా షాపులలో పోలీసులు డాగ్ స్క్వాడ్‌తో మాదక ద్రవ్యాల కోసం ముమ్మర తనిఖీలు నిర్వహించారు. నిషేదిత వస్తువులు షాపులలోకి తీసుకువచ్చి విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని షాపు నిర్వహకులకు సూచించారు. డాగ్ స్క్వాడ్‌తోపాటు బాంబుస్క్వాడ్ బృందం సిబ్బంది, పోలీసు సిబ్బంది ఉన్నారు.

## అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

–ఎస్సై అహ్మద్ మోహియుద్దీన్



డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేస్తున్న పోలీసులు

**కొల్చారం, అక్టోబర్ 25(ప్రభాతవార్త):**
అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై అహ్మద్ మోహియుద్దీన్ హెచ్చరించారు ఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు శనివారం మండల కేంద్రం కొల్చారంలోని కిరాణా దుకాణాలు, హోటళ్లలో మత్తుపదార్థాలు డ్రగ్స్, లిక్కర్లు అమ్ముతున్నారని ముందస్తుగా కొల్చారం పోలీస్ తరపున డాగ్‌స్క్వాడ్ బృందంతో తనిఖీలు నిర్వహించారు. హోటళ్లలో మత్తుపదార్థాలు విక్రయించినా, మద్యం విక్రయించినా ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలని ఈ సందర్భంగా ఎస్సై అహ్మద్ మోహియుద్దీన్ కోరారు.

## జిల్లా యువజన క్రీడల అధికారిని సన్మానించిన మండల విద్యాధికారి



క్రీడల అధికారిని సన్మానిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

**శివ్వంపేట, అక్టోబరు 25, ప్రభాతవార్త:**
మెదక్ జిల్లా యువజన క్రీడల అధికారిగా నియమితులైన గంగాల రమేష్‌ను శివంపేట మండలవిద్యాధికారి బుచ్చానాయక్ శనివారం ఘనంగా సన్మానించారు. శివంపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గంగాల రమేష్‌ను శాలువా, మొమెంటోతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ బుచ్చానాయక్ మాట్లాడుతూ శివంపేట గ్రామానికి చెందిన గంగాల రమేష్ వ్యాయామ ఉపాధ్యాయుడిగా ఈ ప్రాంతంలో క్రీడల అభివృద్ధికి విశేషమైన కృషి చేయడం జరిగిందని తెలిపారు. ఈ ప్రాంతం నుండి క్రీడలలో జాతీయస్థాయి క్రీడాకారులను తయారుచేసిన ఘనత వారికుందని తెలిపారు. జిల్లాస్థాయిలో ఉత్తమ సేవలు అందించి మంచి పేరు తెచ్చుకోవాలని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో శివంపేట, పిల్లుట్ల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలచంద్రం, శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌జిటి యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరికెల వెంకటేశం, పిఆర్టియు మండల అధ్యక్షులు అనిల్‌రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు నర్సాగౌడ్, యాదవరెడ్డి, మండల కార్యదర్శి బాబా, ఉపాధ్యాయులు రామచంద్రారెడ్డి, సురేష్, చంద్రమోహన్, మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## స్థానికసంస్థల ఎన్నికల్లో పోటీచేస్తాం

–టిపిఆర్పీ రాష్ట్ర అధ్యక్షులు రవికుమార్




విలేకరులతో మాట్లాడుతున్న టిపిఆర్పీ రాష్ట్ర అధ్యక్షులు రవికుమార్

**సిద్దిపేట రూరల్, అక్టోబర్ 25, ప్రభాతవార్త :**
రాష్ట్రంలో త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల నుంచి తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ పోటీ చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు జిలకర రవికుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రధానంగా కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు ఉండగా నాలుగువ స్తంభంగా తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ ఆవిర్భవించిందన్నారు. బడుగు, బలహీన వర్గాలకు తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ అండగా నిలుస్తుందన్నారు. సమావేశంలో పార్టీనాయకులు కూనపరెడ్డి, హరిప్రసాద్, దాసరి శ్యామ్‌రావు, గడ్డం బాబన్న, బోగి బాబు, గుడిసె ప్రభు, కిన్నర కనకయ్య, బాబురావు, స్వామి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు సిబ్బందికి వ్యాసరచన పోటీ



పోలీసు సిబ్బందికి వ్యాసరచన పోటీ నిర్వహిస్తున్న దృశ్యం

**సిద్దిపేట రూరల్, అక్టోబర్ 25, ప్రభాతవార్త :**
పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సిద్దిపేట సిఏఆర్ హెడ్ క్వార్టర్‌లో సిపి ఎస్.ఎం.విజయ్‌కుమార్ ఆదేశాల మేరకు ఏఆర్ పోలీసు సిబ్బందికి పని ప్రదేశంలో లింగ వివక్షత అనే అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహించారు. వ్యాసరచన పోటీలో ఏఆర్ పోలీసు సిబ్బంది ఉత్సహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉజ్వల యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

–బిజెపి మండల అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బిజెపి నాయకులు

**పెద్దశంకరంపేట, అక్టోబరు 25, ప్రభాతవార్త:**
ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం ద్వారా నూతన రేషన్ కార్డుదారులకు గ్యాస్ కనెక్షన్ ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల బిజెపి అధ్యక్షుడు బండల శ్రావణ్ కుమార్, మండల బిజెపి మాజీ అధ్యక్షుడు కోణం విట్టల్ శనివారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఉచిత గ్యాస్ కనెక్షన్ కోసం రేషన్ కార్డు, అందులో ఉన్న కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులు, మూడు ఫోటోలు, బ్యాంక్ అకౌంట్, కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ల జిరాక్స్ పేపర్లను అందుబాటులో ఉన్న గ్యాస్ ఏజెన్సీడీలర్ల వద్ద అందజేయాలన్నారు. ఈ అవకాశాన్ని నూతన రేషన్ కార్డు లబ్దిదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల బిజెపి ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణ, బిజెవైఎం అధ్యక్షుడు బుగుడాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలను సందర్శించిన బిఆర్ఎస్వి నాయకులు



పాఠశాలలోని మోటారును పరిశీలిస్తున్న బిఆర్ఎస్వి నాయకులు

**గజ్వేల్, అక్టోబరు 25, ప్రభాతవార్త:**
గజ్వేల్ మండలం కోమటిబండ గ్రామ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న మన్విత్ అనే విద్యార్థికి మూడు రోజుల క్రితం విద్యుత్‌షాక్ తగిలిన విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ విద్యార్థి విభాగం అధ్యక్షుడు శిలసారం ప్రవీణ్, పంగ మోహన్‌బాబులు శనివారం వారి ఇంటికి వెళ్లి పరామర్శించడంతో పాటు పాఠశాలకు వెళ్లి విద్యుత్ షాక్ ఎలా తగిలిందనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ముగ్గురు ఉపాధ్యాయులు, ఆయాలు ఉండి కూడా చదువుకునే విద్యార్థికి పనిచెప్పడం ఏమిటని ఉపాధ్యాయులను ప్రశ్నించారు. విద్యార్థులను సొంత పిల్లల్లా చూసుకుంటూ మంచి విద్యను బోధించి ఉన్నతులుగా తీర్చిదిద్దాల్సిన ఉపాధ్యాయులే పిల్లలకు పనిచెప్పడం మంచిదికాదన్నారు. ఇప్పటికైనా ఉపాధ్యాయులు పిల్లలను మంచిగా చూసుకుంటూ విద్యాబోధన నేర్పించాలన్నారు. వారివెంట మాజీ గ్రామ సర్పంచ్ తూం శేఖర్, సీనియర్ నాయకులు షేక్ భాస్కర్, ఉబ్బని ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రధానోపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలి



విద్యార్థి కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న దళితసంఘాల నాయకులు

**గజ్వేల్ టౌన్, అక్టోబరు 25, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని కోమటిబండ గ్రామంలో గల ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థి మాన్విత్ కరెంట్‌షాక్‌కు గురికావడానికి కారణమైన పాఠశాల ప్రధానోపాధ్యాయునిపై చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల నాయకులు పొన్నాల కుమార్, తుమ్మ శ్రీనివాస్, దాసరి ఏగొండస్వామిలు డిమాండ్ చేశారు. శనివారం కోమటిబండలోని విద్యార్థి కుటుంబసభ్యులను పరామర్శించి పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో చదువుకోవడానికి వచ్చిన విద్యార్థులతో పనిచేయించడం దారుణమన్నారు. విద్యార్థులతో పనిచేయించే ఉపాధ్యాయులపై, పాఠశాలలపై నిఘా ఏర్పాటుచేయాలని జిల్లా యంత్రాంగాన్ని డిమాండ్ చేశారు.

## సదాశివపేటలో విద్యుత్ అధికారుల ప్రజాబాట



ప్రజాబాటలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ అధికారులు

**సదాశివపేట, అక్టోబరు 25, ప్రభాతవార్త:**
శనివారం సదాశివపేట పట్టణంలోని 8వ వార్డులోని హనుమాన్‌నగర్, శక్తినగర్‌లో విద్యుత్ అధికారులు ప్రజాబాట కార్యక్రమం నిర్వహించారు. విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ల చుట్టుప్రక్కల పేరుకుపోయిన పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా ఏఈ మధుసూదన్‌రెడ్డి, మాట్లాడుతూ వారానికి మూడు రోజులు ప్రతి వీధిని విద్యుత్ అధికారులు పరిశీలించడం జరుగుతుందన్నారు. ప్రతి మంగళ, గురు శనివారాలలో ప్రజాబాట కార్యక్రమం ఉంటుందన్నారు. సమస్యలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలను మొదటగా పర్యటించి అక్కడ ఉన్న విద్యుత్ సమస్యను తొలగించి ప్రజలకు ఇబ్బంది కాకుండా చేస్తామన్నారు. ఏదైనా విద్యుత్ సమస్య ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 1912కు ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కిషన్, హరీష్, దావూద్, ప్రేమానందం తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాద బాధితులకు ఎమ్మెల్యే ఆర్థికసహాయం

**పాపన్నపేట, అక్టోబరు 25, ప్రభాతవార్త:**
ఆరునెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించిన బాధితకుటుంబానికి మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు రూ.లక్ష ఆర్థికసహాయంచేశారు. పాపన్నపేట మండలం లక్ష్మీనగర్లో శనివారంజరిగిన రాధాకిషన్ దశదినకర్మ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే నివాళులు అర్పించారు. రామతీర్థం గ్రామానికి చెందిన కన్నె బోయిన గంగారాం ఆరు నెలల క్రితం రాంపూర్ సమీపంలోని అనుముబండల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఆయనకు భార్య నాగమణి, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉండగా, వారికి ఎమ్మెల్యే ఆర్థిక సహాయంచేశారు. ఆయనవెంట మండలపార్టీ అధ్యక్షులు గోవింద్‌నాయక్, మల్లప్ప, ప్రశాంత్‌రెడ్డి, పంతులు భూమన్న, పార్శా నర్సింలు, ఆకుల శ్రీనివాస్, నరేందర్‌గౌడ్, టీబో, నాని, షాహెద్ పాషా ఉన్నారు.

**ఏడుపాయల ఆలయ వరదనష్టానికి రూ.1.50 కోట్లు మంజూరుచేయండి...**
మంజీర వరదల వల్ల ఏడుపాయల్లో దెబ్బతిన్న ప్రాంతాలను మరమ్మతులు చేయడానికి రూ.1.50 కోట్లు మంజూరుచేయాలని దేవాదాయశాఖమంత్రి కొండా సురేఖకు విజ్ఞప్తిచేసినట్లు మెదక్ ఎమ్మెల్యే తెలిపారు. తెలంగాణలో ప్రసిద్ధిచెందిన పుణ్యక్షేత్రం కావడంతో లక్షలాదిభక్తులు దుర్గమ్మదర్శనానికి తరలివస్తుంటారని తెలిపారు. భక్తులకు ఇబ్బందికలుగకుండా, వెంటనే మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు.

## పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివి

–సిఐ రేణుకరెడ్డి




పోలీసు అమరవీరుల వారోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

**అల్లాదుర్గం, అక్టోబరు 25, ప్రభాతవార్త:**
పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని అల్లాదుర్గం సిఐ రేణుకరెడ్డి అన్నారు. శనివారం పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని మండల కేంద్రమైన అల్లాదుర్గంలో 161వ జాతీయ రహదారిపై సిఐ రేణుకరెడ్డి ఆధ్వర్యంలో 2కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ రేణుకరెడ్డి మాట్లాడుతూ పోలీసులు ప్రజల కొరకు చేస్తున్న సేవా కార్యక్రమాలను ప్రజలు కలకాలం గుర్తుంచుకుంటారన్నారు. యువత క్రమశిక్షణతో ముందుకు సాగితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చన్నారు. సమాజంలో శాంతిభద్రతల కొరకు పోలీసులు సమయానికి ఆహారం తీసుకోకుండా, కుటుంబసభ్యులతో కులాసాగా గడిపే సమయంలేక, కంటి నిండా నిద్రపోలేక పోలీసులు నిరంతరం సేవలు అందిస్తున్నారని గుర్తుచేశారు. పోలీసులకు ప్రతి ఒక్కరు సహకరిస్తూ శాంతిభద్రతలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పోలీసులు తమ ఆరోగ్యంపై ప్రత్యేకశ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో అల్లాదుర్గం ఎస్ఐ శంకర్, ఏఎస్ఐ గాలయ్య, హెడ్ కానిస్టేబుల్ సాయిలు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## గౌడజనహక్కుల పోరాటసమితి కార్యనిర్వాహక అధ్యక్షులుగా బుర్ర శ్రీనివాస్‌గౌడ్



శ్రీనివాస్‌గౌడ్‌ను సత్కరిస్తున్న నాయకులు

**హుస్నాబాద్ రూరల్, అక్టోబరు 25, ప్రభాతవార్త**
గౌడజన హక్కుల పోరాటసమితి మోకుదెబ్బ తెలంగాణ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులుగా హుస్నాబాద్‌కు చెందిన బుర్ర శ్రీనివాస్‌గౌడ్ ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో శనివారం పట్టణ కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని గీత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని, తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తానని హామీ ఇచ్చారు. తన నియామకానికి సహకరించిన సంఘం రాష్ట్ర అధ్యక్షులు అమరవేని నర్సాగౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగుల సిద్దిరాములుగౌడ్‌లతోపాటు కార్యవర్గ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నూతన రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులుగా ఎంపికైన శ్రీనివాస్‌గౌడ్‌ను సంఘం నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. విలేకరుల సమావేశంలో గౌడసంఘం నాయకులు బుర్ర వెంకన్నగౌడ్, పాకాల శ్యాంసుందర్‌గౌడ్, బుర్ర జగన్‌గౌడ్, బొమ్మగాని సదానందంగౌడ్, నాయకులు పూదరి రామన్న, పున్న చందు, బొడ్డు శ్రీనివాస్, బత్తుల రవీందర్, తదితరులు ఉన్నారు.

## సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు

**జోగిపేట, అక్టోబరు 25, ప్రభాతవార్త:**
సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు అందించడానికి సిద్ధంగా ఉన్నాయని, ఇవి కావాల్సిన రైతులు దరఖాస్తు చేసుకోవాలని అందోలు వ్యవసాయ శాఖ ఏడిఏ రమాదేవి తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, మహిళా రైతులకు యాభైశాతం, ఇతర రైతులకు నలభై శాతం సబ్సిడీపై ఈ పరికరాలు అందించనున్నట్లు ఆమె తెలిపారు. బ్యాటరీ స్ప్రేయర్లు, పవర్ స్ప్రేయర్లు, రోటావేటర్లు, సీడ్ కం ఫర్టిలైజర్ డ్రిల్లు, కేజీవీల్, పవర్ వీడర్లు, బ్రష్ కట్లు, పవర్ టిల్లర్లు, పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. దరఖాస్తుఫారం, ఆధార్‌కార్డు, పట్టాదారు పాసు పుస్తకం, ఇక ట్రాక్టర్ పరికరాలకు ఆర్సీ జిరాక్సు, రెండు పాస్‌పోర్టు సైజు ఫోటోలు, సాయిల్ హెల్త్‌కార్డు తప్పనిసరిగా జతపరిచి ఏవోలకు అందచేయాలన్నారు. అందోలు, చౌటకూరు, పుల్కల్, హత్నూర మండలాలకు చెందిన రైతులు తమ దరఖాస్తులను క్లస్టర్ ఏఇవోలకు అందచేయాలని ఆమె పేర్కొన్నారు.

## అంబులెన్స్‌ల పనితీరును పర్యవేక్షించిన షాహిద్

**మనూర్, అక్టోబరు 25, ప్రభాతవార్త:**
108, 102 సేవల అంబులెన్స్‌ల పనితీరుపై జిల్లా ప్రోగ్రాం మేనేజర్ షేఖ్ జాన్ షాహిద్ శుక్రవారం పర్యవేక్షించారు. 102, 108 అంబులెన్స్ వాహనాలను పరిశీలించి వాహనాల్లో సరైన మోతాదులో మందులు అందుబాటులో ఉన్నాయాం? లేవా? అని పరిశీలించారు. అత్యవసర సమయంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందచేయాలని సూచించారు. మండలంలో 102, 108 అంబులెన్స్ సిబ్బంది పనితీరుపై మేనేజర్ సంతృప్తి వ్యక్తంచేశారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు హుస్సేన్, కిరణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం

**ములుగు, అక్టోబరు 25, ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన ములుగుకుచెందిన గుర్రాల భారతమ్మ అనారోగ్యంతో శనివారం మృతి చెందగా విషయం తెలుసుకున్న ఉమ్మడి మెదక్ జిల్లా డిసిసిబి డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేల ఆర్థిక సహాయం అందించారు. డిసిసిబి డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి వెంట మాజీ ఎంపిటిసి హరిబాబు, గ్రామ కమిటీ అధ్యక్షుడు శిలసాగర్ బాలరాజ్, శ్రీనివాస్‌గౌడ్, వార్డు సభ్యులు నాగేష్, కనకయ్య, శ్రీనివాస్, భూచక్రం, బిక్షపతి తదితరులు ఉన్నారు.

**IN THE COURT OF HONOURABLE PRINCIPAL DISTRICT JUDGE COURT COMPLEX, SANGAREDDY**
**G.W.O.P. No.30 OF 2025**
BETWEEN:
**SMT. SHWETA RAHUL KELKAR AND ANOTHER ....PETITIONERS**
AND
**ALL CONCERNED ...RESPONDENT**
To
**ALL CONCERNED ....RESPONDENT**
Please take Notice that the above Petitioner No.1 **SMT. SHWETA RAHUL KELKAR** has filed above **G.W.O.P. NO. 30 OF 2025** to appoint and declare her as legal Guardian of the minor son Ishved Kelkar son of Late Rahul Kelkar, aged 13 years, with a permission to alienate the property Apartment No.3015, admeasuring built up area 1073 Sti.Feet along with common service area 252 Sq.Feet in Ground Floor of Block No.III including common areas and amenities together with undivided land admeasuring 31.85 Sq.Metres or 38.03 Sq.Yards in **JANAPRIYA NILE VALLEY** Out of land admeasuring Acres 24-25.5 Guntas in Survey No. 341 (P), 342, 334 (P) and 335 (P) of Ameenpur village, Patancheru Mandal, Sanga reddy District (Old Medak Dist) Telangana. The above case is posted on **10-11-2025 at 10.30 a.m.** for your appearance in person or through Advocate/Pleader before the said Hon'ble Court, failing which the matter will be heard and decided as per law.
(BY ORDER OF THE HONOURABLE COURT)
**Sd/- DHIRENDRA SINGH, M. KALAVATI, K. SWAPNA**
**Advocates**
14-1-367/1, Aghapura, Hyd-1
**PH No. 9490932931**
**COUNSEL FOR THE PETITIONERS**

## తూతూమంత్రంగా మార్కెట్‌కమిటీ సర్వసభ్య సమావేశం

-సమాచారం లేకుండానే నిర్వహించిన వైనం



సదాశివపేట మార్కెట్ కమిటీ సర్వ సభ్యసమావేశం

**సదాశివపేట, అక్టోబరు 25, ప్రభాతవార్త:**
మూడు నెలలకోసారి నిర్వహించి వ్యవసాయ మార్కెట్ కమిటీ సర్వసభ్య సమావేశం వైస్ చైర్మన్ కంది కృష్ణ అధ్యక్షతన శనివారం జరిగింది. జూలై, ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో జరిగిన ఆదాయవ్యయాల గురించి చర్చించామని అలాగే మార్కెట్ అభివృద్ధి గురించి తీసుకోవలసిన చర్యల గురించి మార్కెట్ కమిటీ సభ్యులతో చర్చించడం జరిగిందని కంది కృష్ణ అన్నారు. అలాగే మండలంలోని ఉచిత పశువైద్యశిబిరం గురించి, సిసిఐ పత్తి కొనుగోలు ప్రారంభం చేయడం గురించి మాట్లాడామని ఆయన అన్నారు. ఇది అలా ఉంటే, మార్కెట్ కమిటీ సర్వసభ్య సమావేశం గురించి ఎజెండా విషయాలుగాని, సమావేశం గురించిగాని సమాచార పత్రికలకు ఎలాంటి సందేశం ఇవ్వకపోవడం వెనకాల మతలబు ఏమిటని పలువురు అంటున్నారు. ఆదాయవ్యయాలు అభివృద్ధిగురించి వారు ఏమి చర్చించారో సమాచారశాఖకు ఎలాతెలుస్తుందని అంటున్నారు. పత్తికొనుగోలు ప్రారంభం కాకముందే ప్రైవేట్ కంపెనీలు రైతుల దగ్గర వారి అవసరాలను చూసుకొని తక్కువధరకు కొంటూ ఒకవైపు రైతులను మోసంచేస్తుంటే మీరు ఏమిచర్యలు తీసుకున్నారని, రైతుసంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అంటారు తప్ప, ఎక్కడ అమలు జరుగుతుందని తెలంగాణ మంజీరా రైతు సమైక్య అధ్యక్షుడు తుమ్మలపల్లి పృథ్వీరాజ్ అధికారులను నిలదీసిన సంగతి తెలిసిందే. ఈ సర్వసభ్య సమావేశంలో మార్కెట్ కమిటీ కార్యదర్శితోపాటు సభ్యులు శివకుమార్, మధుకర్‌రెడ్డి, నరేందర్‌గౌడ్, చవాన్ సోమ్లా, కొత్త లక్ష్మణ్‌కుమార్, కొమ్ము రమేష్, యూసుఫ్, కళావతి తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి పోరాటాలకు సిద్ధం




మాట్లాడుతున్న టిఎస్‌యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి అనురాధ

**మునిపల్లి, అక్టోబరు 25, ప్రభాతవార్త:**
ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యల పరిష్కారానికి పోరాటాలకు సిద్ధం కావాలని టిఎస్‌యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి అనురాధ పిలుపునిచ్చారు. టిఎస్‌యుటిఎఫ్ మునిపల్లి మండల మహాసభకి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం అమలుకు పూర్వం నియామకమైన ఉపాధ్యాయులకు టెట్ ఉత్తీర్ణత తప్పనిసరి కాకుండా సవరణ ఉత్తర్వులు పొందాలని అన్నారు. ఉపాధ్యాయ అర్హత పరీక్షను ప్రాస్పెక్టివ్‌గా అమలు చేసేవిధంగా కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో విద్యాహక్కు చట్టం సెక్షన్ 23ను సవరించాలన్నారు. ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) సిలబస్‌ను, అర్హతమార్కులను సవరించి టెట్ పరీక్షను ఈరెండేళ్లలో వీలైనన్ని ఎక్కువ సార్లు నిర్వహించాలని కోరారు. నెల మొదటి తేదీన వేతనాలు గురుకుల, మోడల్, కెజిబివి ఉపాధ్యాయులకు అందడం లేదన్నారు. హెల్త్ కార్డ్స్ పనిచేయటం లేదని, పిఆర్సీ ఊసేలేదని, ప్రతి నెల బకాయిల చెల్లింపులు జరగటం లేదన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి టిఎస్‌యుటిఎఫ్ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నిరుపరాణి, మునేష్, జిల్లానాయకులు అశోక్‌కుమార్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## హరితహారం చెట్లను నరికిన విద్యుత్ అధికారులు



చెట్లను తొలగించిన దృశ్యం

**అక్కన్నపేట, అక్టోబరు 25, ప్రభాతవార్త:**
అక్కన్నపేటమండలం పంతులుతండా గ్రామపంచాయతీ పరిధిలో నూతన సబ్‌స్టేషన్ మెయిన్ లైనుకోసం విద్యుత్ పోల్ నాటారు. పోల్‌లకు వైర్లు లేకుండానే దారివెంబడి ఉన్న హరితహారం చెట్లు పంతులుతండా నుండి హింసింగ్‌తండా వరకు దాదాపు 100చెట్లను విద్యుత్ అధికారులు కొట్టివేశారు. గ్రామపంచాయతీ అనుమతి లేకుండా హరితహారం చెట్లను ఎలా కొట్టివేస్తారని తండావాసులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. అయితే విషయం కార్యదర్శి కనుసన్నల్లోనే జరిగిందని ప్రభుత్వం కోట్ల రూపాయలు పెట్టి చెట్లను పెంచాలని చూస్తుంటే కొంతమంది అధికారుల నిర్లక్ష్యంవల్ల ప్రభుత్వలక్ష్యం నీరుగారిపోతుందని తండావాసులు అంటున్నారు. హరిత మొక్కలను కొట్టేసిన అధికారులపై, వారికిసహకరించిన పంచాయతీ కార్యదర్శులపై ఉన్నతాధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తండావాసులు డిమాండ్ చేస్తున్నారు.

## చివరిగింజ వరకు ధాన్యం ప్రభుత్వమే కొంటుంది

-రైతులు అధైర్యపడొద్దు
-మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు పుట్ట నర్సింగరావు



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

**గుమ్మడిదల, అక్టోబరు 25, ప్రభాతవార్త:**
పటాన్‌చెరు నియోజకవర్గంలోని గుమ్మడిదలమండల రాంరెడ్డిబావిగ్రామంలో శనివారం మండలకాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు పుట్ట నర్సింగరావు ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలుకేంద్రాన్ని ప్రారంభించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పటాన్‌చెరు నియోజకవర్గ ఆత్మకమిటీ చైర్మన్ కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పండించే ధాన్యాన్ని చివరిగింజవరకు ప్రభుత్వమే కొంటుందని ఎవరు ఆందోళనకు గురిచేసేవిధంగా మాట్లాడినా, మభ్యపెట్టి ఆందోళనకు గురిచేసినా, ఏమాత్రం అధైర్యపడకుండా ఉండాలని అన్నారు. తగిన సమయానికి మద్దతుధర కేటాయించి ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడివో ఉమాదేవి, మాజీ అధ్యక్షుడు మద్ది వీరారెడ్డి, మాజీ ఎంపిటిసి సురభి నాగేందర్‌గౌడ్, గోవర్ధన్‌గౌడ్, దయాకర్‌రెడ్డి, లక్ష్మీ మ్మనారాయణ, జైశంకర్‌గౌడ్, పడమటి మహి పాల్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, సహకార సంఘం సెక్రటరీ లక్ష్మణ్‌నాయక్, కుమ్మరి వెంకటేష్, అంజత్ పాషా, రాజుగౌడ్, రవి, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# శిథిలావస్థకు చేరిన గడిపెద్దాపూర్ పాఠశాల

-ఆందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు



గడిపెద్దాపూర్ పాఠశాల పైకప్పు గోడల పెచ్చులూడుతున్న దృశ్యం

**అల్లాదుర్గం, అక్టోబరు 25, ప్రభాతవార్త:**
వర్షం కురిస్తే ఆ పాఠశాలకు సెలవు ప్రకటించడం తప్పనిసరి. తరగతులు ప్రారంభమయ్యాక వర్షం కురుస్తుంటే పాఠాలు బోధించే ఉపాధ్యాయులు, పాఠశాలు వింటున్న విద్యార్థులు తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని సమయాన్ని గడపాల్సి ఉండగా ఇళ్లలో ఉండే తల్లిదండ్రులు పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. బిక్కుబిక్కుమంటూ సమయాన్ని గడుపుతూ ఉంటారు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాల్లోకి వెళితే.. మండలపరిధిలోని గడిపెద్దాపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల శిథిలావస్థకు చేరుకుంది. వర్షం కురుస్తున్న సమయంలో పాఠశాలలో ఉండేవారు తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని గడపాల్సిన దయనీయ దుస్థితి దాపురించిందని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. పాఠశాల భవనం నిర్మించి 6దశాబ్దాలు పూర్తి అయినందున భవనం గోడలు, పైకప్పుల పెచ్చులూడిపోతున్నాయి. పాఠశాల సందర్శనకు వచ్చే అధికారులుగాని, పాలకులుగాని పట్టించుకుని మరమ్మతులకు సిఫారసు చేసిన దాఖలాలు లేకుండా పోయాయని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు లేవని విచారం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల, ఉపాధ్యాయులు క్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని పాఠశాలకు నూతన భవనాన్ని మంజూరు చేయించి విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు నిర్మించాలని తల్లిదండ్రులు సూచిస్తున్నారు.

## గుంతలమయమైన గంగ్వార్-అల్లాదుర్గం రోడ్డు

-ప్రతి దినం పాట్లు పడుతున్న ప్రయాణీకులు
-రోడ్డును పరిశీలించిన ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నరోత్తం



రోడ్డును పరిశీలిస్తున్న ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నరోత్తం

**న్యాల్‌కల్, అక్టోబరు 25, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని గంగ్వార్-అల్లాదుర్గం రోడ్డపై ప్రయాణం ప్రాణసంకటంగా మారిందని, అయినా అధికారులు పట్టించుకోవడంలేదని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై.నరోత్తం ఆందోళన వ్యక్తంచేశారు. శనివారం గంగ్వార్-అల్లాదుర్గం రోడ్డును నరోత్తం పరిశీలించారు. ఈసందర్భంగా నరోత్తం మాట్లాడుతూ అంతర్‌రాష్ట్రం కర్ణాటక, తెలంగాణను కలిపేరోడ్డని, ప్రఖ్యాతి గాంచిన మెదక్ చర్చ్‌కు ఈదారి గుండానే వెళ్లాల్సి ఉంటుందని నరోత్తం గుర్తుచేశారు. హద్నూర్, ముంగి గ్రామాల మధ్య రోడ్డుదుస్థితి మరీ అధ్వాన్నంగా ఉందని విచారం వ్యక్తంచేశారు. రోడ్డుపై ప్రయాణించే వాహన చోదకులు పలుమార్లు ప్రమాదాలకు గురై క్షతగాత్రులయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి కోతకుగురై, మోకాలులోతు గోతులుపడ్డ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని నరోత్తం డిమాండ్‌చేశారు.

## పైప్‌లైన్ లీకేజీ అవుతున్నా పట్టింపులేని కార్యదర్శి



పైప్‌లైన్ లీకేజీ అవుతున్న దృశ్యం

**కోహెడ, అక్టోబరు 25,ప్రభాతవార్త:**
మండలపరిధిలోని రాంచంద్రపూర్ గ్రామపంచాయతీ సమీపంలో పైప్‌లైన్ లీకేజీతో నీరు రోడ్డుపాలవుతోంది. గత కొన్నినెలల నుంచి పైపులైన్ లీకేజీలతో నీరంతా రోడ్డుమీద పారుతూ బురదమయంగా మారుతుంది. నెలలు గడస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. గత కొన్నినెలలుగా పలుచోట్ల ఇలాగే లీకేజీలయ్యి నీరంతా వృథా అవుతున్నా పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పట్టించుకున్న పాపానపోవడం లేదన్నారు. నీరంతా కలుషితం అయినా అధికారుల్లో కనీస చలనం రావడం లేదని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైపులైన్ లీకేజీలను మరమ్మతులు చేపట్టి నీటిని వృథాచేయకుండా, కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## శ్రీలలితాదేవి వైభవానికి రారండి...

-27న కార్తీకదీపం, 28న సత్యనారాయణవ్రతం

**నారాయణఖేడ్, అక్టోబరు 25, ప్రభాతవార్త:**
నారాయణఖేడ్ పట్టణంలో శ్రీలలితాదేవి వైభవం ఆధ్వర్యంలో ఈనెల 27న కార్తీకదీపోత్సవం శ్రీవేంకటేశ్వరస్వామి కళ్యాణమహోత్సవం నిర్వహిస్తున్నట్లు ప్రముఖ పురోహితులు మలమంచి మోహన్‌జోష్ తెలిపారు. శివకేశవులకు ప్రీతిగా ఉన్న కార్తీకమాసం మొదటి సోమవారం సాయంత్రం 5గంటలకు తహసీల్దార్ మైదానంలో కార్తీకదీపోత్సవం వేంకటేశ్వరకళ్యాణం, మాధవానందస్వామీజీ ప్రసంగం నిర్వహిస్తున్నట్లు పంతులు తెలిపారు. కావున అధిక సంఖ్యలో భక్తజనాలు వచ్చి, కార్యక్రమంలో పాల్గొని, తీర్థప్రసాదాలు స్వీకరించవలెనని ఆయనకోరారు. అదేవిధంగా 28వతేదీన శ్రీదుర్గాభవానీ మందిరంవద్ద మాఫంక్షన్‌హాల్‌సమీపంలో అష్టలక్ష్మి, మహాసుదర్శనయాగం రమాసహిత శ్రీసత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహిస్తున్నట్లు, భక్తులు పాల్గొని కృపాకటాక్షములు పొందాలని నిర్వాహకులు తెలిపారు.

## అబద్ధాలకు కేరాఫ్ అడ్రస్ హరీష్‌రావు

-మండల కాంగ్రెస్‌పార్టీ ఓబిసి సెల్ అధ్యక్షులు బంక చిరంజీవియాదవ్



విలేకరులతో మాట్లాడుతున్న దృశ్యం

**సిద్దిపేట అర్బన్(చిన్నకోడూరు), అక్టోబరు 25, ప్రభాతవార్త:**
అబద్ధాలకు కేరాఫ్ అడ్రస్ హరీష్‌రావు అని...గత బిఆర్‌ఎస్ పాలనలో ఎన్ని రేషన్ కార్డులు ఇచ్చారో తెలియజేయాలని మండల కాంగ్రెస్‌పార్టీ ఓబిసి సెల్ అధ్యక్షులు బంక చిరంజీవియాదవ్ ప్రశ్నించారు. శనివారం చిన్నకోడూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. అబద్ధాలు ఆడడంలో హరీష్‌రావు నెంబర్ వన్ అని మరోసారి నిరూపించుకున్నారని పేర్కొన్నారు. బిఆర్‌ఎస్ పాలనలో ఒక్క పేదకుటుంబానికి ఒక్క రేషన్‌కార్డు కూడా ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చిన కొద్దినెలల్లోనే పేదకుటుంబాల ఇబ్బందులను దృష్టిలోపెట్టుకొని అర్హులైన ప్రతి నిరుపేదకుటుంబానికి రేషన్‌కార్డు అందించడంతోపాటు కార్డులో పేర్లులేని వ్యక్తులపేర్లను సైతం ఎక్కించి ప్రతివ్యక్తికి 6 కిలోలచొప్పున సన్నబియ్యం అందజేయడం జరుగుతుందన్నారు. పేదల సంక్షేమం, అభివృద్ధియే ధ్యేయంగా సిఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలన సాగిస్తున్నారని తెలిపారు. హరీష్‌రావు అబద్ధపు మాటలునమ్మి మోసపోవద్దని ప్రజా సంక్షేమానికి పాటుపడుతున్న కాంగ్రెస్ సర్కారుకు అండగా నిలవాలన్నారు. సమావేశంలో పార్టీనాయకులు జంగిటి బాలరాజు, దిలీప్, రాజేందర్, కూన శ్రీనివాస్, ఎరువా సత్యనారాయణ, కూన సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

## మూలమలుపుల దగ్గర పిచ్చిగడ్డిని తొలగించండి



మూలమలుపుల వద్ద పెరిగిన పిచ్చిమొక్కల దృశ్యం

**అక్కన్నపేట, అక్టోబరు 25, ప్రభాతవార్త:**
అక్కన్నపేట మండలం నుండి రామవరం వెళ్లేదారిలో మూలమలుపుల దగ్గర పిచ్చిగడ్డి మొలిచి అటునుండి వచ్చే వాహనదారులకు రోడ్డు కనబడకుండా ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారుల ఆవేదన వ్యక్తంచేశారు. రెండు రోజుల క్రితం అక్కన్నపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలోగల సెల్‌టవర్‌వద్ద రెండుద్విచక్రవాహనాలు ఢీకొని, రోడ్డుప్రమాదం జరిగిందని, అయితే జరిగిన ప్రమాదంలో వాహనదారులకు స్వల్ప గాయాలు కావడంతోపాటు వాహనాలు తుక్కుతుక్కయిపోయాయని గ్రామస్థులు చెబుతున్నారు. ఇదే రోడ్డులో రైతులు, ప్రజలు తమ వ్యవసాయ క్షేత్రాలకు, పశువుల వద్దకు నిత్యం ద్విచక్ర వాహనాలతోపాటు కలినడకన ఎక్కువగా తిరుగుతూ ఉంటారని, కనుక మూలమలుపులవద్ద ఎదురుగావచ్చే వాహనాలు కనబడకుండా పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించాలని సంబంధిత అధికారులను వాహనదారులు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## సా మిల్ వ్యాపారి మృతి...

**పాపన్నపేట, అక్టోబరు 25, ప్రభాతవార్త:**
పాపన్నపేట మండలం మిన్పూర్కు చెందిన కట్టెలమిషన్ వ్యాపారి వడ్ల సదాశివుడు(55) గుండె సంబంధిత ఇబ్బందులతో శనివారం హైద్రాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో మరణించాడు. పావన్నపేట మండలంలో గత 30 యేళ్లుగా వ్యాపారం చేస్తున్న ఆయన గత కొంతకాలంగా, డయాలసిస్ చేయించుకుంటున్నారు. ఇతనికి భార్య, ముగ్గురు కొడుకులు, కూతురు ఉన్నారు. కాగా సదాశివుని మృతిపట్ల పలువురు సంతాపం తెలిపారు.

# తడిసినధాన్యాన్ని ఆంక్షలులేకుండా కోనుగోలుచేయాలి

-మార్కెట్‌కు శాశ్వత కార్యదర్శిని నియమించాలి
-బిజెపి పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్‌బాబు



మాట్లాడుతున్న బిజెపి పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్‌బాబు

**హుస్నాబాద్‌రూరల్, అక్టోబరు 25, ప్రభాతవార్త:**
తడిసిన ధాన్యాన్ని ఆంక్షలు లేకుండా కొనుగోలు చేయాలని బిజెపి హుస్నాబాద్ పట్టణ అధ్యక్షులు బత్తుల శంకర్‌బాబు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్లోని వడ్ల కొనుగోలు కేంద్రాన్ని పార్టీ శ్రేణులతో కలిసి సందర్శించి, తడిసినవడ్లను పరిశీలించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మార్కెట్‌కార్యదర్శి అందుబాటులో లేకపోవడంతో, మార్కెట్ సూపర్‌వైజర్ గంగారాంతో మాట్లాడి, రైతుల సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం అకాలవర్షాలతో రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంట, కోనుగోలు కేంద్రాలలో అమ్మడానికి తీసుకువస్తే, మార్కెట్ అధికారులు నిరక్ష్యం చేయడంతో తడిసి, ముద్దై రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత 15రోజులుగా రైతులు మార్కెట్‌యార్డులో పడిగాపులు కాస్తున్నారని, తాలు, తేమశాతం పేరుతో రైతులను అధికారులు అరిగోస పెడుతున్నారన్నారు. సన్నవడ్లు పండిస్తే బోనస్ ఇస్తామనిచెప్పిన ప్రభుత్వం ఇచ్చినహామీని విస్మరించిందన్నారు. సన్నరకం పండించిన రైతు సారవ్వ ధాన్యాన్ని కోనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి 15రోజులు గడిచినా, తేమశాతం17 వచ్చిందని అయినా అధికారులు కాంట వేయకుండా, 650 బస్తాలు అయితేనే లోడ్ అవుతుందని, అనడంతో 15 రోజులుగా రైతు సారవ్వ పాడిగాపులు కాస్తుండగా ఇటీవల కురిసిన అకాలవర్షాలకు ధాన్యం మళ్లీ తడిసిందని ఆవేదన వ్యక్తం చేసిందన్నారు. ఆంక్షలుపెడుతూ రైతును అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. ఇలా మార్కెట్ యార్డులో ప్రతి రైతును అధికారులు తేమశాతం కారణంతో కాలక్షేపంచేస్తూ రైతుల్లో ఆందోళన సృష్టిస్తున్నారన్నారు. లక్షలు వెచ్చించి వడ్లు ఆరబోసే డ్రయర్ తీసుకువచ్చిన అధికారులు, ఒక్క రోజు మురిపమే అన్నచందంగా ఉందన్నారు. మార్కెట్ కమిటీకి శాశ్వత కార్యదర్శి లేకపోవడంతో మార్కెట్లోని రైతుల సమస్యలను పట్టించుకునే దిక్కులేదని, వెంటనే శాశ్వత కార్యదర్శిని నియమించాలని డిమాండ్ చేశారు. పెరిగిన రైతులకు అనుగుణంగా మార్కెట్‌సామర్థ్యం పెంచాలన్నారు. కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు వేముల దేవేందర్ రెడ్డి, తోట సమ్మయ్య, వరియోగుల అనంత స్వామి, హుస్నాబాద్ పట్టణ ఉపాధ్యక్షులు వేల్పుల నాగార్జున్, బోడిగే వెంకటేష్, ప్రధాన కార్యదర్శి పోలోజు రాజేందర్‌చారీ, శక్తికేంద్ర ఇంచార్జీ నారోజు నరేష్, బిజెపినాయకులు బోనగిరి రాజేష్, వేముల రమణతోపాటు తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు ఆదర్శంగా నిలిచిన అఖిలజారెడ్డి

-డిఎస్పీ ఉద్యోగినికి ఘనంగా సన్మానం



డిఎస్పీ ఉద్యోగం సాధించిన అఖిలజారెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

**న్యాల్‌కల్, అక్టోబరు 25, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని మిర్జాపూర్(బి) గ్రామానికిచెందిన హద్నూర్ సొసైటీ చైర్మన్ జగన్నాథ్‌రెడ్డి కుమార్తె అఖిలజారెడ్డి ఇటీవల ప్రకటించిన గ్రూప్-1 పరీక్షల్లో ప్రతిభచాటి డిఎస్పీ ఉద్యోగం సొంతంచేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని శనివారం గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మాట్లాడుతూ అఖిలజారెడ్డి గ్రామంతో పాటు మండలానికి మంచిపేరు తీసుకువచ్చారని, విద్యార్థులకు ఆదర్శంగా నిలిచారని కొనియాడుతూ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్, ఉపాధ్యాయులు, గ్రామప్రముఖులు పాల్గొన్నారు.

## వీరశైవ లింగాయత్ సమాజ్ అధ్యక్షులుగా ఆనంద్‌స్వరూప్ శెట్కార్



ఆనంద్‌స్వరూప్ శెట్కార్‌ను అభినందిస్తున్న దృశ్యం

**నాగల్‌గిద్ద, అక్టోబరు 25, ప్రభాతవార్త:**
నారాయణఖేడ్ నియోజకవర్గ వీరశైవలింగాయత్ సమాజం అధ్యక్షులుగా ఎన్నికైన ఆనంద్‌స్వరూప్‌శెట్కార్‌ను జిల్లా అధ్యక్షులు ఇప్పపల్లి నర్సింలు, ప్రధానకార్యదర్శి కొంక రాజేశ్వరిలు అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. వీరశైవ లింగాయత్‌లు అన్నిరంగాల్లో రాణించాల్సిన అవసరం ఉందని, అందుకు తనవంతు సహకారం అందిస్తానని ఆనంద్‌స్వరూప్ శెట్కార్ పేర్కొన్నారు.

## కట్టా రామచంద్రరెడ్డి సంస్మరణ సభకు పెద్ద ఎత్తున తరలిరావాలి

-పివైఎల్ రాష్ట్రకార్యదర్శి బాణోత్ సంతోష్‌కుమార్

**హుస్నాబాద్ రూరల్, అక్టోబరు 25, ప్రభాతవార్త:**
భారత విప్లవోద్యమం అడుగుజాడల్లో నడుస్తూ, సమసమాజ స్థాపన కోసం, పీడితవర్గాల ప్రజలకోసం ఉద్యమించిన విప్లవోద్యమ నాయకులు ఇటీవల కేంద్ర ప్రభుత్వం చేసిన బూటకపు ఎన్కౌంటర్లో మృతిచెందిన మాజీ కేంద్రకమిటీ సభ్యులు కామ్రేడ్ కట్టా రామచంద్రరెడ్డి అలియాస్ రాజుదాదా సంస్మరణసభ నేడు(ఆదివారం) హుస్నాబాద్ నియోజకవర్గంలోని కోహెడ మండలకేంద్రంలోని సింగరాయ ఫంక్షన్‌హాల్‌లో అమర వీరుల, బంధుమిత్రులసంఘం ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని, ఈకార్యక్రమానికి ప్రజలు, సానుభూతిపరులు పెద్ద ఎత్తున తరలిరావాలని పివైఎల్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి బానోత్ సంతోష్‌నాయక్ పిలుపునిచ్చారు. రామచంద్రారెడ్డి 30ఏళ్ల సుదీర్ఘ విప్లవప్రయాణం ఉత్తేజకరమైనదని, భారత విప్లవోద్యమకారుల అడుగుజాడలు ఆయన ఆచరణలో కనిపిస్తాయని గుర్తుచేశారు. కేంద్రప్రభుత్వం ఆపరేషన్‌కగార్ పేరుతో మావోయిస్టులను, ఆదివాసు లను అంతంచేయాలన్న కుట్రతో చత్తీస్‌గఢ్ రాష్ట్రంలో సెప్టెంబర్ 22వ జరిగిన బూటకపు ఎన్కౌంటర్లో మావోయిస్టుపార్టీ కేంద్రకమిటీ సభ్యులు రామచంద్రరెడ్డి అలియాస్ రాజుదాదా అమరుడుకావడం బాధాకరమన్నారు. కోహెడలోజరిగే వారి సంస్మరణసభకు పెద్దయెత్తున హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈసభకు ముఖ్యఅతిథులుగా జస్టిస్ చంద్ర కుమార్, గాదె ఈన్నయ్య, ఎన్ నారాయణరావు, మాదన కుమారస్వామి, పాణి, వివిధ పౌర హక్కుల సంఘాలనేతలు, ప్రజాస్వామికవాదులు, సామాజిక కార్యకర్తలు, అమరవీరుల బంధుమిత్రులు పాల్గొంటారని వివరించారు.

## శ్మశానవాటికకు అడ్డుగా ప్రహరీగోడ

-భయభ్రాంతులకుగురిచేస్తూ నిర్మిస్తున్న పరిశ్రమపై చర్యలుతీసుకోండి
-మాజీసర్పంచ్ మేడిపల్లి మురళి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

**గుమ్మడిదల, అక్టోబరు 25, ప్రభాతవార్త:**
261 సర్వే నంబర్ ప్రభుత్వ భూమిలో అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలునిర్మిస్తూ, గుండాలనుపెట్టి పరిశ్రమయాజమాన్యం స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నది. గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని అన్నారం వార్డులో ఓ భారీ పరిశ్రమ ప్రభుత్వ, అసైన్డ్‌భూముల్లో ఎలాంటి అనుమతులులేకుండా అక్రమంగా ప్రహరీగోడను నిర్మిస్తున్నదని, వెంటనే నిర్మాణాలను నిలిపివేయాలని మాజీసర్పంచ్ మేడిపల్లి మురళి తహసీల్దారు, మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదుచేశారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నారంపట్టణంలో 261 సర్వే నంబర్ అసైన్డ్‌భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా పారిశ్రామికవాడలోని అన్నోరా పరిశ్రమ యాజమాన్యం 261 సర్వే నంబర్లోని 150 ఎకరాల చుట్టూ ప్రహరీగోడను నిర్మిస్తుందని తహసీల్దార్ పరమేశంకు, మున్సిపల్ కమిషనర్ దశరథంకు ఫిర్యాదుచేశాడు. ఈసందర్భంగా అధికారులతో మాట్లాడుతూ 201 సర్వే భూమిలో గత ప్రభుత్వం నిరుపేదలకు ఎకరా చొప్పన పట్టాలు ఇచ్చింది. అలాగే ఈ ప్రహరీగోడ ప్రాంగణంలో గ్రామానికి సంబంధించిన శ్మశానవాటికి ఉందని తెలిపారు. నిరుపేదలకు సంబంధించిన భూములను భయభ్రాంతులకు గురిచేసి గుండాలను పెట్టుకుని ప్రహరీగోడను నిర్మిస్తున్నారని అధికారులకు వివరించారు. ఈ పరిశ్రమకు సమీపంలో కెసిఆర్‌కాలనీ, పలువెంచర్లు ఉన్నాయని తెలిపారు. ఈవిషయమై ప్రశ్నించినవారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా పరిశ్రమ యాజమాన్యం నిర్మిస్తున్న ప్రహరీగోడను వెంటనే నిలిపివేసి నిరుపేదలకు సంబంధించిన భూములను శ్మశాన వాటికను కాపాడాలని కోరారు.

## అన్నిదానాల కంటే రక్తదానం గొప్పది

-ఎస్పీ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన రక్తదానశిబిరం

**రామాయంపేట, అక్టోబరు 25, ప్రభాతవార్త:**
పోలీసు అమరవీరుల సంస్మరణదినోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న వారోత్సవాల్లోభాగంగా శనివారం మెదక్‌పట్టణంలోని ఎస్పీ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన రక్తదానశిబిరం విజయవంతమైంది. శిబిరాన్ని జిల్లా అడిషనల్ ఎస్పీ మహేందర్ ప్రారంభించగా, ఆతర్వాత జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు సందర్శించి పరిశీలించారు. పోలీసు అమరవీరుల సంస్మరణదినోత్సవం సందర్భంగా వారం రోజులపాటు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మెదక్ డిఎస్పి ప్రసన్నకుమార్‌తోపాటు జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్ల సిఐలు, ఎస్ఐలు, ఇతరవిభాగాల పోలీసులు, సొసైటీ మెదక్‌శాఖ చైర్మన్ లయన్ డాక్టర్ ఏలేటి రాజశేఖర్‌రెడ్డి, కార్యదర్శి టి.సుభాష్‌చంద్రబోస్‌బోస్, కోశాధికారి డిజి శ్రీనివాస్‌శర్మ, ఎగ్జిక్యూటివ్‌సభ్యులు దేమే యాదగిరి, వి.సతీష్‌రావు, ప్రసాద్, జిడి తిరుపతి, లింగమూర్తి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.